ప్రజాశక్తి

శనివారం 13 ఏప్రిల్ 2024 పేజీలు 8





విజయనగరం పార్వతీపురం మన్యం

బాలికలదే పైచేయి

- ఇంటర్ ఫలితాల్లో మన్యం జిల్లా 11వస్థానం
- విజయనగరం జిల్లాకు ప్రథమ ఇంటర్‌లో 13, ద్వితీయ ఇంటర్‌లో 21వ స్థానాలు
- ఒకేషనల్‌లో మన్యం ఫస్ట్



ఎప్పటిలాగే ఈఏడాది కూడా పార్వతీపురం మన్యం, విజయనగరం జిల్లాల్లో ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో బాలికలదే పైచేయి అయ్యింది. విజయనగరం జిల్లా ప్రథమ ఇంటర్‌లో రాష్ట్రంలో 13వ స్థానం, ద్వితీయ ఇంటర్‌లో 21వ స్థానంలో నిలిచింది. పార్వతీపురం మన్యం జిల్లా ప్రథమ, ద్వితీయ ఇంటర్‌లోనూ 11వ స్థానం సాధించింది. ఒకేషనల్ కోర్సు ఫలితాల్లో రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలవడం గమనార్హం.

ప్రజాశక్తి-విజయనగరం టౌన్/పార్వతీపురంరూరల్

విజయనగరం జిల్లా నుంచి ప్రథమ ఇంటర్‌లో జనరల్ విద్యార్థులు మొత్తం 16584 మంది పరీక్షకు హాజరు కాగా వారిలో 10267మంది ఉత్తీర్ణులై 62శాతం ఫలితాలు నమోదు చేశారు. ఒకేషనల్ విద్యార్థులు 2909 మంది హాజరు కాగా 1678మంది ఉత్తీర్ణులై 58శాతం ఫలితాలు నమోదు చేశారు. ద్వితీయ ఇంటర్‌లో జనరల్ విద్యార్థులు 15189 మంది హాజరు కాగా 10,591 మంది ఉత్తీర్ణులై 70శాతం ఫలితాలు నమోదు చేశారు. ఒకేషనల్ విద్యార్థులు ప్రథమ ఇంటర్‌లో 2909 మందికి గాను 1679 మంది ఉత్తీర్ణులై 58స్థానంలో నిలవగా, రెండో ఏడాది 2693 మంది హాజరు కాగా వారిలో 1824మంది ఉత్తీర్ణులై 68శాతం ఫలితాలు నమోదు చేశారు.

ప్రథమ ఇంటర్‌లో మొత్తం విద్యార్థుల్లో బాలికలు 8903 మందిలో 6033మంది ఉత్తీర్ణులై 68శాతం, బాలురులో 7681 మందికి 4234 శాతం ఉత్తీర్ణులై 55శాతం ఫలితాలు సాధించారు. ద్వితీయ ఇంటర్‌లో మొత్తం (మిగతా..3లో)

మోడల్ స్కూల్స్‌లో ..

ప్రథమ ఇంటర్లో వేపాడ 99.16 శాతం, పెరుమాలి 90.12 శాతం, నెల్లిమర్ల 87.36 శాతంతో వరుస మూడు స్థానాల్లో నిలిచాయి. ద్వితీయ ఇంటర్లో పెరుమాలి 94.90శాతం, వేపాడ 94.67శాతం, ఎల్.కోట 93.75శాతం సాధించి మొదటి మూడు స్థానాల్లో నిలిచాయి.

ప్రభుత్వ కళాశాలల ఫలితాలు

ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ద్వితీయ ఇంటర్‌లో బాడంగి ప్రభుత్వ జూనియర్ కళాశాల 93.62 శాతం, వేపాడ కళాశాల 83.08 శాతం, డెంకాడ జూనియర్ కళాశాల 74.19 శాతం ఫలితాలు సాధించాయి. ప్రథమ ఇంటర్‌లో దత్తిరాజేరు 100శాతం, బాడంగి 74.51 శాతం, వేపాడ జూనియర్ కళాశాల 62 శాతం ఫలితాలు సాధించాయి. దత్తిరాజేరు మండలంలో ఒక్క విద్యార్థి మాత్రమే హాజరు కాగా ఆ విద్యార్థి ఉత్తీర్ణుడై వందశాతం ఉతీర్ణత సాధించాడు.



ఎన్నికల కంట్రోల్ రూమ్‌ను పరిశీలిస్తున్న రాష్ట్ర ఎన్నికల పరిశీలకులు మిశ్రా

రాష్ట్ర ఎన్నికల పరిశీలకుల పర్యటన

ప్రజాశక్తి-విజయనగరం

రాష్ట్ర ఎన్నికల సాధారణ పరిశీలకులు రామ్మోహన్ మిశ్రా శుక్రవారం జిల్లాలో పర్యటించారు. ఆయనకు జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి స్వాగతం పలికారు. జిల్లాలో ఎన్నికల నిర్వహణకు చేపట్టిన ఏర్పాట్లు, ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలుకు తీసుకున్న చర్యలు, సీజర్ మేనేజ్‌మెంట్, ఎన్నికల శిక్షణ తదితర అంశాలను, తన ఛాంబర్‌లో జరిగిన సమావేశంలో కలెక్టర్ వివరించారు. ఇప్పటివరకు జిల్లాలో సుమారు కోటీ 54 లక్షల రూపాయల విలువైన నగదు, మద్యం, ఇతర వస్తువులను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

జిల్లాలో ఎన్నికల ప్రక్రియను సజావుగా పూర్తి చేసేందుకు, శాంతి భద్రతల పరిరక్షణకు తీసుకున్న చర్యలను ఎస్‌పి దీపిక వివరించారు. ఇప్పటివరకు ఏర్పాటు చేసిన చెక్‌పోస్టులు, తనిఖీలకు సంబంధించిన అంశాలను తెలిపారు. ఎన్నికల కంట్రోల్ రూమును పరిశీలకులు మిశ్రా సందర్శించారు. వివిధ విభాగాల పనితీరును, ఇప్పటివరకు అందిన ఫిర్యాదులు, తీసుకున్న చర్యలను కలెక్టర్ వివరించారు. ఎంసిఎంసి, కంప్లయింట్ సెల్, 24 గంటల కాల్ సెంటర్, సి విజిల్ తదితర విభాగాల పనితీరుపై మిశ్రా ఆరా తీశారు. పర్యటనలో జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్, డిఆర్ఓ ఎస్‌డి అనిత, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మీడియా సెంటర్‌ను పరిశీలించిన అబ్జర్వర్

ఎన్నికల సందర్భంగా కలెక్టరేట్‌లో జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ ఏర్పాటు చేసిన మీడియా సెంటర్‌ను రాష్ట్ర ఎన్నికల సాధారణ పరిశీలకులు రామ్మోహన్ మిశ్రా శుక్రవారం (మిగతా..3లో)



బహిరంగ సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న అదితి గజపతిరాజు, నాయకులు

16న జిల్లాకు బాబు, పవన్ రాక


విజయనగరంలో బహిరంగ సభ

ప్రజాశక్తి-విజయనగరం కోట

టిడిపి అధినేత చంద్రబాబునాయుడు, జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ బహిరంగసభ ఈనెల 16న విజయనగరంలో జరుగుతుందని ఆ పార్టీ నాయకులు తెలిపారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లపై శుక్రవారం పార్టీ కార్యాలయం అశోక్‌బంగ్లాలో పొలిట్‌బ్యూరో సభ్యులు పి.అశోక్ గజపతిరాజు, నియోజకవర్గ అభ్యర్థి పూసపాటి అదితి విజయలక్ష్మి ఆధ్వర్యాన నాయకులంతా సమావేశమయ్యారు. ఆరోజు మధ్యాహ్నం 3 గంటలకు బాలాజీ జంక్షన్‌లో జరిగే ఎన్నికల ప్రచార సభలో చంద్రబాబు, పవన్ కల్యాణ్ పాల్గొంటారని తెలిపారు. ఈ సందర్భంగా సభ ఏర్పాట్లు, అధికారుల నుంచి అనుమతులు గురించి చర్చించారు. అనంతరం పార్టీ నాయకులతో కలిసి అదితి విజయలక్ష్మి గజపతి రాజు బాలాజీ జంక్షన్ ప్రాంతాన్ని సందర్శించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఐవిపి రాజు, పట్టణ అధ్యక్షులు ప్రసాదుల లక్ష్మీ వరప్రసాద్, కార్యదర్శి గంటా పోలినాయుడు, కార్యాలయ కార్యదర్శి రాజేష్ బాబు, పిల్లా విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సిఆర్‌టిల రెగ్యులరైజేషన్‌కు దండిగా వసూళ్లు

- ఒక్కొక్కరి నుంచి రూ.లక్షన్నర
- గిరిజన సంక్షేమశాఖలో శృతిమించిన లంచాల పర్వం
- అక్రమ బదిలీలకూ కలెక్షన్లు
- ఫిర్యాదు చేసినా స్పందించని జిల్లా అధికారులు



ఐటిడిఎ ప్రాజెక్టు పరిధి గిరిజన సంక్షేమ శాఖ లో లంచాల పర్వం శతిమించి పోతోంది. లంచం లేనిదే పైళ్ళు ముందుకు కదలడం లేదన్న ఆరోపణలు గుప్పుమంటున్నాయి. కార్యాలయం బాస్ సూత్రధారిగా వసూళ్ల బాగోతం గత కొంతకాలంగా కొనసాగుతున్నా పట్టించుకున్న నాధుడే లేడు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కాంట్రాక్టు ఉపాధ్యాయుల రెగ్యులరైజేషన్ లో భాగంగా పార్వతీపురం ఐటిడిఎ పరిధిలో 133మంది సిఆర్‌టిలు అర్హత సాధించారు. వీరి నుంచి రకరకాల కొర్రీల పేరుతో కార్యాలయం అధికారులు దండిగా డబ్బులు వసూలు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఒక్కో సిఆర్‌టి నుంచి లక్షా 50వేల రూపాయల వరకు వసూలు చేయడం చర్చనీయాంశమవుతోంది.

ప్రజాశక్తి - సాలూరు

జీవో నెంబర్ 114 ప్రకారం సిఆర్‌టిల రెగ్యులరైజేషన్ చేపట్టాల్సి ఉంది. 2014 జూన్ 2 లోగా చేరిన కాంట్రాక్టు ఉపాధ్యాయులంతా రెగ్యులరైజేషన్‌కు అర్హులని రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈనెల 15న గిరిజన సంక్షేమశాఖ అధికారులు ఇందుకు సంబంధించి ఉత్తర్వులు జారీ చేశారు. అయితే రాష్ట్రంలో ఏ ఐటిడిఎ ప్రాజెక్టు పరిధిలోనూ జరగని విధంగా స్థానిక ఐటిడిఎ అధికారులు ఈ ప్రక్రియను అమలు చేయడం లో భారీగా చేతివాటం ప్రదర్శించారన్న ఆరోపణలు ఉన్నాయి. గిరిజన సంక్షేమ శాఖ రాష్ట్ర కార్యాలయంలో పని చేస్తున్న ఓ అధికారి అండతో స్థానిక కార్యాలయం బాస్‌గా పనిచేస్తున్న అధికారి వసూళ్ళ బాగోతాన్ని నడిపించినట్లు తెలుస్తోంది.

అసలే ఎన్నికల హడావుడిలో ప్రభుత్వ యంత్రాంగం, ప్రధాన రాజకీయ పార్టీలు వున్న సమయంలో గుట్టు చప్పుడు కాకుండా రెగ్యులరైజేషన్ ముసుగులో అధికారులు వసూళ్లు చేపట్టారనే విమర్శలు వినిపిస్తున్నాయి. జీవో నెంబర్ 114 ప్రకారం సిఆర్‌టిల రెగ్యులరైజేషన్ ప్రక్రియలో గిరిజన సంక్షేమ శాఖ స్థానిక అధికారులు చేసిన తప్పిదాలకు సిఆర్‌టిలను ఇబ్బంది పెట్టి వసూళ్లకు పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయి. పత్రికల్లో ఉద్యోగ నియామక ప్రకటన ద్వారా దరఖాస్తు చేసుకుని అర్హతల మేరకు వీరంతా సిఆర్‌టిలుగా నియామకయ్యారు. కానీ అధికారులు మాత్రం వారిని పార్ట్ టైం టీచర్లుగా పేర్కొంటూ రాష్ట్ర స్థాయి కార్యాలయానికి పత్రాలు పంపించారు. దీనిపై రాష్ట్ర అధికారులు అభ్యంతరం వ్యక్తం చేస్తూ ఐటిడిఎ అధికారులు పంపిన పత్రాలను వెనక్కి తిప్పి పంపించారు. ఈ వ్యవహారంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కూడా (మిగతా..3లో)

వాలంటీర్ల రాజీనామా

ప్రజాశక్తి-నెల్లిమర్ల

నగర పంచాయతీలోని ఏడో వార్డుకు చెందిన ఐదుగురు, అలుగోలు పంచాయతీలో 15 మంది వాలంటీర్లు ఉద్యోగాలకు రాజీనామా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వాలంటీర్ వ్యవస్థను టిడిపి నాయకులు తప్పు పట్టడం భావ్యం కాదన్నారు. అందుకే రాజీనామా చేసి సిఎం జగన్ మోహన్ రెడ్డిని సార్వత్రిక ఎన్నికల్లో గెలిపించి తీరుతామని శపథంచేశారు.

డెంకాడ : మండలంలో డెంకాడ గ్రామ సచివాలయ పరిధిలో 20 మంది వాలంటీర్లు రాజీనామా చేశారు. రాజీనామా పత్రాలను పంచాయతీ సెక్రటరీకి సమర్పించారు. వైసిపికి మద్దతుగా రాజీనామా చేస్తున్నట్లు వారు ప్రకటించారు.

పూసపాటిరేగ : పూసపాటిరేగ, చౌడువాడ, వెళ్దూరు గ్రామాల్లో వాలంటీర్లు తమ రాజీనామా పత్రాలను కార్యదర్శులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మళ్లీ జగన్‌ను సిఎంను చేసేందుకు తాము రాజీనామాలు చేస్తున్నామన్నారు. వాలంటీర్లతో జెడ్‌పిటిసి భర్త మహంతి జనార్ధన్ రావు, సర్పంచ్ టొంపల సీతారాం, పిఎసిఎస్ చైర్మన్ మహంతి లక్ష్మణరావు ఉన్నారు.



డెంకాడలో రాజీనామా పత్రాలతో వాలంటీర్లు



ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే శంబంగి చినప్పలనాయుడు

గొల్లపల్లిలో ఎమ్మెల్యే శంబంగి ప్రచారం

ప్రజాశక్తి-బొబ్బిలి

మున్సిపల్ పరిధిలోని గొల్లపల్లిలో చైర్మన్ సావు మురళీకృష్ణ ఆధ్వర్యాన ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు శుక్రవారం ఎన్నికల ప్రచారం చేశారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా సంక్షేమ పథకాలు అందజేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డిని మరోసారి సిఎంను చేసుకుందామని ఆయన ఓటర్లను అభ్యర్ధించారు. మునుపెన్నడూ లేని విధంగా అర్హత ఉన్న లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు అందుతున్నాయి అంటే దానికి కారణం సిఎం జగన్ మాత్రమేనని చెప్పారు. కార్యక్రమంలో బొబ్బిలి నియోజకవర్గ జెసిఎస్ కన్వీనర్ శంబంగి వేణుగోపాల నాయుడు, జిల్లా జెసిఎస్ కన్వీనర్ శంబంగి శ్రీకాంత్, మున్సిపల్ వైస్ చైర్మన్లు చెలికాని మురళీకృష్ణ, రమాదేవి, 12వ వార్డు కౌన్సిలర్ సావు శారద, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

వికలాంగులను భాగస్వామ్యం చేయాలి

ప్రజాశక్తి-గరివిడి

సమాజంలో జరిగే కార్యక్రమాలలో వికలాంగులను భాగస్వామ్యం చేయాలని ఎంఇఒలు పి.రామారావు, డి.అప్పన్న అన్నారు. సమగ్ర శిక్ష, విద్యాశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక భవిత కేంద్రం వద్ద వికలాంగులకు ఉచిత ఉపకరణాల పంపిణీ కోసం వైద్య నిర్ధారణ శిబిరం నిర్వహించారు. జిల్లా సహిత విద్య సహ సమన్వయకర్త ఎం.భారతి మాట్లాడుతూ ఈ నిర్ధారణ శిబిరంలో పాల్గొన్న దివ్యాంగులను వైద్యులు పరీక్షించి వారికి అవసరమైన ఉపకరణాన్ని సూచిస్తారని తెలిపారు. మొరకముడిదాం, చీపురుపల్లి, గరివిడి, గుర్ల మండలాలకు చెందిన సుమారు 100 మంది శిబిరంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు ఎ.తాజ్ కుమార్, హెచ్.వి.కె.నాయుడు పాల్గొన్నారు.

టిడిపిలో చేరికలు

ప్రజాశక్తి-బొబ్బిలి

మండలంలోని అల్లంనాయుడువలస, గొంగాడ వలస గ్రామాలకు చెందిన 80 కుటుంబాలు వైసిపిని వీడి టిడిపి తీర్థం పుచ్చుకున్నారు. వీరంతా శుక్రవారం కోటకు చేరుకుని ఎమ్మెల్యే అభ్యర్థి బేబినాయన సమక్షంలో టిడిపిలో చేరారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు అల్లాడ భాస్కరరావు, వి.సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు. కలవరాయి మాజీ సర్పంచ్ పాటూరి కృష్ణమూర్తితోపాటు సుమారు 100 కుటుంబాలో టిడిపిలో చేరాయి.

బిర్యానీస్ రెస్టారెంట్ ప్రారంభం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలోని భాష్యం స్కూలు ఎదురుగా నూతనంగా నిర్మించిన బిర్యానీస్ అండ్ మోర్ నూతన రెస్టారెంట్‌ను జెడ్‌పి చైర్మన్ కుమార్తె సిరి సహస్ర శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర కార్యదర్శి కెవి సూర్యనారాయణరాజు, జల్లా కార్యదర్శి కనకల రఘురామారావు తదితరులు పాల్గొన్నారు.

బిసి గురుకుల కళాశాల హవా

ప్రజాశక్తి-నెల్లిమర్ల

ఇంటర్ ఫలితాల్లో ఎంజెబిపిబిసి గురుకుల బాలికల కళాశాల హవా సాగింది. స్థానిక బిసి గురుకుల కళాశాల విద్యార్థులు ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షల్లో 80మంది ఉత్తీర్ణులై 94శాతం నమోదు చేశారు. ఎంపిసి గ్రూపు లో ఎం. వసంత 979 మార్కులు, ఎస్. వాణి 976 మార్కులు సాధించారు. సీనియర్ ఇంటర్ లో ప్రధమ, ద్వితీయ స్థానాలు సాధించారు. ఈ సందర్భంగా ప్రిన్స్ పాల్ సిహెచ్ రమా మోహిని విద్యార్థులను అభినందించారు.

వైసిపి హయాంలో కుంటుపడిన అభివృద్ధి

జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి లోకం మాధవి



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న లోకం మాధవి

ప్రజాశక్తి-నెల్లిమర్ల

వైసిపి హయాంలో అభివృద్ధి కుంటుపడిందని జనసేన అభ్యర్థి లోకం మాధవి తెలిపారు. మండలంలోని దన్నానపేట, కొత్తపేట, సీతారామునిపేట, గొర్లిపేటలో శుక్రవారం ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధి పనుల కూలీల వద్దకు వెళ్లి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వారి సమస్యల పరిష్కారం కోసం అవరమైతే తానే కూలీగా మారి అండగా నిలుస్తానన్నారు. అధికార వైసిపి దోచుకోవడం, దాచుకోవడం తప్ప సామాన్యుల సమస్యలు పట్టించుకోలేదని తెలిపారు. గొర్లిపేటలో టిడిపికి చెందిన మాజీ వార్డు సభ్యులు పప్పల రాము తన అనుచరులతో జనసేన పార్టీలో చేరారు. ఈ ప్రచారంలో తెలుగు మహిళా పార్లమెంట్ అధ్యక్షులు సువ్వాడ వనజాక్షి, టిడిపి మండల అధ్యక్షులు కడగల ఆనంద్‌కుమార్, రాష్ట్ర కార్యదర్శి పతివాడ తమ్మునాయుడు, జిల్లా అధికార ప్రతినిధి గేదెల రాజారావు,నాయకులు గురాన అసిరినాయుడు, లెంక అప్పల నాయుడు, జనసేన నాయకులు పతివాడ అచ్చెన్నాయుడు, గడల అచ్చెన్నాయుడు తదితరులు పాల్గొన్నారు.



ఇవిఎంల కేటాయింపు కార్యక్రమంలో పాల్గొన్న ఎన్నికల పరిశీలకులు, కలెక్టర్, ఎస్‌పి

ర్యాండమైజేషన్ ద్వారా ఇవిఎంల కేటాయింపు

విజయనగరం కోట : వచ్చే ఎన్నికల్లో వినియోగించేందుకు ర్యాండమైజేషన్ ద్వారా ఇవిఎంలను కేటాయించారు. స్థానిక ఎన్ఐసి కార్యాలయంలో, రాష్ట్ర ఎన్నికల సాధారణ పరిశీలకులు రామ్మోహన్ మిశ్రా, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో జిల్లా ఎన్నికల అధికారి నాగలక్ష్మి శుక్రవారం ఈ ప్రక్రియను నిర్వహించారు. కంప్యూటర్ ర్యాండమైజేషన్ ద్వారా వివిధ నియోజకవర్గాలకు ఇవిఎంలను ఎంపిక చేశారు. కార్యక్రమంలో జిల్లా ఎస్‌పి దీపిక, జెసి కె.కార్తీక్, డిఆర్‌ఒ ఎస్‌డి అనిత, ఇవిఎంల నోడల్ అధికారి బి.ఉమాశంకర్, డిఆర్‌డిఎ పీడీ ఎ.కల్యాణచక్రవర్తి, రాజకీయ పార్టీల ప్రతినిధులు రొంగలి పోతన్న, ఎంవి నర్సింహరాజు, రెడ్డి శంకర్రావు, కె.సోములు, ఎం.రవి, ఎం.ప్రవీణ్‌కుమార్, ఎన్నికల విభాగం అధికారులు ఉన్నారు.

ప్రశాంత ఎన్నికలకు సహకరించండి

డిఎస్‌పి గోవిందరావు

ప్రజాశక్తి- భోగాపురం

ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు సహకరించాలని విజయనగరం డిఎస్‌పి ఆర్.గోవిందరావు కోరారు. మండలంలోని లింగాల వలసలో ఎన్నికలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో ఎవరైనా అల్లర్లకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అన్నారు. ఎన్నికల రోజున పోలింగ్ కేంద్రానికి వంద మీటర్ల దూరంలో ఉండాలని తెలిపారు. పోలింగ్ కేంద్రానికి సమీపంలో అనవసరమైన వ్యక్తులు సంచరించడం లేదా గుంపులుగా ఉండకూడదని అన్నారు. క్యూలైన్ పాటించి ఓటు వేసి వెళ్లిపోవాలని తెలిపారు.



మాట్లాడుతున్న డిఎస్‌పి గోవిందరావు

అనంతరం సైబర్ నేరాలు గురించి వివరించారు. కార్యక్రమంలో సిఐ రవికుమార్, ఎస్ఐ టిఎస్ఎన్ రాజు, వివిధ రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పకడ్బందీగా శ్లాస్ అమలు

ప్రజాశక్తి - విజయనగరం టౌన్

విద్యార్థుల్లో నైపుణ్యాన్ని వృద్ధి చేసే శ్లాస్ కార్యక్రమాన్ని పగడ్బందీగా అమలు చేయాలని జిల్లా విద్యా శాఖ అధికారి ఎన్ ప్రేమ్ కుమార్ తెలిపారు. శుక్రవారం గురజాడ స్కూల్ లో శ్లాస్ కార్యక్రమంపై నిర్వహించిన శిక్షణా శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల అభ్యసన స్థాయి, నై పుణ్య స్థాయి, అభ్యసన లోపాలు, అవగాహన స్థాయి తెలుసుకొని వాటిని సరిచేయడం కోసం చేపట్టే శ్లాస్ కార్యక్రమాన్ని అన్ని పాఠశాలల్లో అమలు చేయాలన్నారు. అనంతరం శిక్షణ ప్రాధాన్యత ను వివరించారు. కార్యక్రమంలో శిక్షకులు ఎస్.రాంబాబు,సమగ్ర శిక్షా ఎఎంఒ ప్రసాదరావు, ఎగ్జామ్ బోర్డు కన్వీనర్ సన్యాసిరాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నగరాభివృద్ధికి మరో అవకాశమివ్వండి

ఎన్నికల ప్రచారంలో కోలగట్ల

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరాన్ని అభివృద్ధి చేసేందుకు తనకు మరో అవకాశం ఇవ్వాలని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. శుక్రవారం నగరంలోని ధర్మపురిలో జరిగిన ఎన్నికల ప్రచార కార్యక్రమంలో కోలగట్ల పాల్గొన్నారు. 2019లో తనకు ఎమ్మెల్యేగా అవకాశం ఇస్తే సామాన్యుడి పాలన ఏ విధంగా ఉంటుందో చూపించానని అన్నారు. మరోసారి అవకాశం ఇస్తే మరింత అభివృద్ధి చేసి సమస్యలు లేని నగరంగా తీర్చిదిద్దుతానని హామీ ఇచ్చారు. అవినీతి లేకుండా ప్రభుత్వ పథకాలు ప్రజల చెంతకు చేరాయని చెప్పారు. కార్యక్రమంలో నగర మేయర్ వి.విజయలక్ష్మి, డివిజన్ ఇన్‌ఛార్జి కనకల కృష్ణ, కార్పొరేటర్ పతివాడ గణపతిరావు, మేయర్ విజయలక్ష్మి, వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



కోలగట్లకు తిలకం దిద్దుతున్న మహిళ

కోలగట్లకు మద్దతుగా నేడు మహిళల ర్యాలీ

విజయనగరం టౌన్ : వైసిపి అభ్యర్థి కోలగట్ల వీరభద్రస్వామికి మద్దతుగా శనివారం నగరంలో మహిళలతో మెగా ర్యాలీ నిర్వహిస్తున్నట్లు నగర మేయర్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి తెలిపారు. శుక్రవారం వైసిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ నగరాభివృద్ధికి కోలగట్ల మళ్లీ గెలివాల్సిన చాలా అవసరం ఉందన్నారు. ఇప్పటికే గత ఐదేళ్ల పాలనలో నగరాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశారన్నారు. సమస్యలు లేని నగరంగా తీర్చిదిద్దడమే ధ్యేయం గా పని చేస్తున్న ఎమ్మెల్యే కోలగట్ల వీరభద్రస్వామిని గెలిపించేందుకు మహిళలు సిద్దంగా ఉన్నారని తెలిపాఉ. ఎన్‌సిఎస్ వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహం నుంచి కన్యకా పరమేశ్వరి, గంట స్థంభం, మూడు లాంతర్లు మీదుగా కోట జంక్షన్ వరకు ర్యాలీ ఉంటుందని, అనంతరం సభ జరుగుతుందని తెలిపారు. సమావేశంలో మహిళా కార్పొరేటర్లు, వైసిపి మహిళా విభాగం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలి నుంచి స్వతంత్రంగా పోటీ

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

బొబ్బిలి శాసనసభ నియోజకవర్గ పరిధిలో ఉన్న గ్రామాలలో జరుగుతున్న అవినీతి, అక్రమాలను నియోజకవర్గ ప్రజలకు తెలియజేసేందుకే తాను స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్నట్లు బొబ్బిలి నియోజకవర్గం ఉద్దవోలు గ్రామానికి చెందిన మరడాన వెంకట నాయుడు వెల్లడించారు. శుక్రవారం విజయనగరం ప్రెస్ క్లబ్లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తమ నియోజకవర్గ పరిధిలోనికి వచ్చే రాజాం మండలం కొత్తపేట గ్రామానికి చెందిన కృష్ణమూర్తి మాస్టారి మృతిని ఆసరాగా చేసుకొని నియోజకవర్గ ప్రధాన నాయకుడు రాజకీయాలు సాగిస్తున్నారని, తమ రెండు కుటుంబాలలో చిచ్చు పెట్టారని, మృతుని కుటుంబంతో తమకు ఏ విధమైన ఆర్థికపరమైన, వ్యాపారపరమైన, రాజకీయపరమైన విభేదాలు ఎప్పుడూ లేవన్నారు. నియోజకవర్గాన్ని శాశిస్తున్న ఒక నాయకుని రాజకీయ స్వార్థానికి తమ రెండు కుటుంబాలు బలయ్యాయని, ఇలాగే వివిధ గ్రామాల్లో పలు కుటుంబాలు బలవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయాలన్నీ వాస్తవాలను బొబ్బిలి ప్రజలకు చెప్పవలసిన బాధ్యత తనపై ఉందని, ఈ ఉద్దేశంతోనే స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్నానని తెలిపారు.

ప్రజల్లో ఆదరణ పెరుగుతోంది

టిడిపి అభ్యర్థి అదితి విజయలక్ష్మి

విజయనగరం కోట : టిడిపి పట్ల ప్రజల్లో రోజురోజుకూ ఆదరణ పెరుగుతుందని ఆ పార్టీ అభ్యర్థి పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతిరాజు అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం ఘోషా ఆసుపత్రి ఏరియా, తోటవీధి, అంబటిసత్రం, అశోక్ నగర్, తదితర ప్రాంతాలలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రబాబు ప్రకటించిన సూపర్ సిక్స్ హామీలను ప్రజలకు వివరించారు. చంద్రబాబు, పవన్ కళ్యాణ్ కలిసి నిర్వహిస్తున్న సభలు దిగ్విజయం కావడం చూసి వైసిపి నాయకుల్లో టెన్షన్ మొదలైందన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఐవిపి రాజు కార్యాలయ కార్యదర్శి రాజేష్ బాబు, పట్టణ అధ్యక్షులు ప్రసాదుల లక్ష్మీ వరప్రసాద్, మండల పార్టీ అధ్యక్షులు బొద్దల నర్సింగరావు, కార్యదర్శి గంటా పోలినాయుడు, అవనాపు విజయ్, పిల్లా విజయ్ కుమార్, గాడు అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

రూ.5.59 లక్షల నగదు సీజ్

ప్రజాశక్తి-బొబ్బిలి

అనుమతులు లేకుండా తరలిస్తున్న రూ.5,59,500 సీజ్ చేసినట్లు పట్టణ సిఐ ఎం.నాగేశ్వరరావు తెలిపారు. గురువారం పాతబొబ్బిలి జంక్షన్లో వాహన తనిఖీలు చేస్తుండగా ముగ్గురు వ్యక్తుల నుంచి నగదు సీజ్ చేసి కేసు నమోదు చేశామని చెప్పారు. తదుపరి చర్యల కోసం జిల్లా పరిషత్ సిఇఒకు పంపినట్లు చెప్పారు. వాహన తనిఖీలో ఎస్ఐ లోవరాజు, కానిస్టేబుల్స్ పాల్గొన్నారు.



కారును తనిఖీలు చేస్తున్న పోలీసులు

మిర్తివలస జంక్షన్లో రూ.89,530

రామభద్రపురం : మిర్తివలస జంక్షన్ వద్ద గురువారం రాత్రి అనుమతులు, ఆధారాలు చూపకుండా తీసుకెళ్తున్న రూ.89,530 నగదు సీజ్ చేసినట్లు ఎస్ఐ జ్ఞానప్రసాద్ తెలిపారు. 50 వేలకు పై బడిన నగదు రవాణాకు ఆధారాలు తప్పనిసరని ఆయన తెల్పిచెప్పారు. సీజ్ చేసిన నగదుపై జెడ్పి సిఇఒకు తదుపరి చర్యలు నిమిత్తం వివరాలు సమర్పించినట్లు తెలిపారు.

బాలికలదే పైచేయి

(మొదటి పేజీ తరువాయి)

బాలురు 6783మంది హాజరు కాగా వారిలో 4377మంది ఉత్తీర్ణులై 64శాతం, బాలికలు 8387మందికి 6214 మంది ఉత్తీర్ణులై 74శాతం ఫలితాలు నమోదు చేశారు. గత ఏడాదితో పోల్చితే ఫలితాల్లో కొంత మెరుగుదల కనిపించింది.

100 శాతం ఫలితాల్లో బాడంగి కెజిబివి

జిల్లాలోని కెజిబివి బాడంగి కళాశాల ప్రథమ, ఇంటర్‌లో వందశాతం ఫలితాలు సాధించింది. రెండో స్థానం 96.67 శాతంతో ఎల్ కోట కెజిబివి కళాశాల నిలిచింది. 93.94 శాతంతో రామచంద్రపురం, నెల్లిమర్ల 90.48 శాతంతో మూడో స్థానంలో ఉన్నాయి. సోషల్ వెల్ఫేర్ కాలేజీల్లో వేపాడ, బాడంగి కళాశాలలు వందశాతం ఫలితాలు సాధించాయి.

పార్వతీపురం మన్యం 11వ స్థానం

పార్వతీపురం మన్యం జిల్లాలో ప్రథమ ఇంటర్‌లో 5475 మంది విద్యార్థులకు గాను 3565 మంది ఉత్తీర్ణత సాధించి 65శాతం నమోదు చేశారు. ద్వితీయ ఇంటర్‌లో 5292 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 4054 మంది ఉత్తీర్ణులయ్యారు. మొత్తంగా 77శాతంతో 11వ స్థానంలో నిలిచింది. జిల్లాలో కొమరాడ ప్రభుత్వ కళాశాల ప్రథమ స్థానంలో నిలిచింది. ప్రథమ ఇంటర్‌లో బాలురు 59శాతం, బాలికలు 70శాతం, ద్వితీయ ఇంటర్‌లో బాలురు 73శాతం, బాలికలు 80శాతం ఫలితాలు సాధించారు.

జిల్లాలోని 14 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మొదటి సంవత్సరం (జనరల్) 1761 మంది విద్యార్థులు హాజరుకాగా 934 మంది విద్యార్థులు, రెండో ఏడాది (జనరల్) 1717 మంది విద్యార్థులు హాజరు కాగా 1169 మంది ఉత్తీర్ణులయ్యారు.

ప్రథమ ఇంటర్‌లో 96 శాతం, ద్వితీయ ఇంటర్‌లో 98శాతం ఉత్తీర్ణతతో కొమరాడ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రథమ స్థానంలో నిలిచిందని వృత్తివిద్యా అధికారి మంజులవీణ తెలిపారు. మక్కువ ప్రభుత్వ కళాశాల ప్రథమ ఇంటర్‌లో 93శాతం, ద్వితీయ ఇంటర్‌లో 95శాతంతో జిల్లాలో రెండోస్థానంలో నిలిచాయని తెలిపారు.

కొమరాడ, గరుగుబిల్లి సోషల్ వెల్ఫేర్ కళాశాలల విద్యార్థులు శతశాతం ఉత్తీర్ణత సాధించారు. సీతంపేట మండలం మల్లి ఎపిటిడబ్ల్యూఆర్ కళాశాల ప్రథమ స్థానంలో, ద్వితీయ ఇంటర్‌లో సీతంపేట (గర్ల్స్) మల్లి, జోగింపేట, కురుపాం, భద్రగిరి (గర్ల్స్) విద్యార్థులు శతశాతం ఉత్తీర్ణులయ్యారు. ఇంటర్ ప్రథమ సంవత్సరం ఫలితాల్లో మక్కువ, గరుగుబిల్లి కెజిబివి కళాశాలలు, ద్వితీయ సంవత్సరంలో మక్కువ, గరుగుబిల్లి, జోగింపేట కురుపాం, చినమేరంగి కాలేజీ విద్యార్థులు శతశాతం ఉత్తీర్ణత సాధించారు. మోడల్ కాలేజీ విభాగంలో మక్కువ కాలేజీ ప్రథమ సంవత్సరం 98శాతం, ద్వితీయ సంవత్సరం వందశాతం ఫలితాలు సాధించింది.

ఒకేషనల్‌లో ప్రథమ స్థానం

ఒకేషనల్ ఫలితాల్లో మన్యం జిల్లా రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిచింది.మొదటి సంవత్సరం 2736 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా 2104 మంది ఉతీర్ణులై 77శాతం ఫలితాలు నమోదు చేశారు. ద్వితీయ సంవత్సరం 2447 మంది విద్యార్థులకు గాను 2034 మంది ఉత్తీర్ణులై 83శాతం ఫలితాలు నమోదు చేశారు.

సిఆర్‌టిల రెగ్యులరైజేషన్‌కు దండిగా వసూళ్లు

(మొదటి పేజీ తరువాయి)

కార్యాలయం అధికారులకు అక్షింతలు వేసినట్లు సమాచారం. రెగ్యులరైజేషన్ పత్రాలు వెనక్కి వచ్చాయని సాకుగా చూపి అధికారులు సిఆర్‌టి నుంచి లక్షా 50వేల రూపాయల చొప్పున వసూలు చేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ వ్యవహారంలో కొందరు ఉపాధ్యాయులే మధ్యవర్తులుగా వ్యవహరించారన్న ఆరోపణలు ఉన్నాయి. తమ ఉద్యోగాల రెగ్యులరైజేషన్ ప్రక్రియ ఎక్కడ నిలిచిపోతుందనే భయంతో సిఆర్‌టిలు అధికారులు అడిగినంత ముడుపులు చెల్లించినట్లు తెలుస్తోంది. రెగ్యులరైజేషన్ ప్రక్రియలో వసూళ్లతో పాటు సిఆర్‌టిల పోస్టింగ్ విషయం లోనూ నిబంధనలకు నీళ్ళొదిలారనే ప్రచారం జరుగుతోంది. రాష్ట్ర కార్యాలయం నుంచి నియామకం ఉత్తర్వుల ప్రకారం కేటాయించిన పాఠశాలలకు ఉపాధ్యాయులను పంపించకుండా ఐటిడిఎ అధికారులు లంచాలు తీసుకుని ఇష్టారాజ్యంగా నియామకం చేయడం చర్చకు తెర లేపింది. కోర్టు ఉత్తర్వుల ప్రకారం బాలికల పాఠశాలల్లో మహిళా ఉపాధ్యాయులను నియమించాలి. కానీ మహిళా ఉపాధ్యాయులను బాలుర ఉన్నత పాఠశాలల్లో నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అల్లు లక్ష్మి అనే పిఇటికి కొమరాడ మండలం ఉలిపిరి గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాలకు నియమించారు. కానీ ఆమెను స్థానిక అధికారులు ఎస్.కోట మండలం కెజి పూడి గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర ఉన్నత పాఠశాలలో నియమించారు. అదే విధంగా ఉలిపిరి గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల పాఠశాలలో నియామకమైన మరో మహిళాటీచర్ చంద్రికకని డోకిశిల గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర ఉన్నత పాఠశాలకు పంపించారు. ధరణి అనే మహిళా టీచర్ ని బొబ్బిలి గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాల నుంచి డోకిశిల గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర ఉన్నత పాఠశాలలో నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. బాలికల పాఠశాలలకు కేటాయించిన మహిళా ఉపాధ్యాయులను బాలుర ఉన్నత పాఠశాలలకు కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేయడం వెనుక కూడా గిరిజన సంక్షేమ శాఖ అధికారులు చేతివాటం ప్రదర్శించారనే ఆరోపణలు గుప్పుమంటున్నాయి. గతంలో గ్రేడ్-2 ప్రధానోపాధ్యాయులుగా ఉద్యోగోన్నతి కల్పించడం లోనూ అధికారులు నిబంధనల ప్రకారం వ్యవహరించలేదని ఫిర్యాదులు అందాయి. జీవో నెంబర్ 23 ప్రకారం హిందీ సీనియర్ అసిస్టెంట్‌కు గ్రేడ్-2 ప్రధానోపాధ్యాయుడిగా ఉద్యోగోన్నతి కల్పించడం వివాదాస్పదమైంది. దీనిపై తోటరమేష్ అనే ఉపాధ్యాయుడు కోర్టును ఆశ్రయించారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా అక్రమ బదిలీలు, పదోన్నతులు కల్పిస్తూ ఐటిడిఎ అధికారులు వసూళ్లకు పాల్పడుతున్నారనేది స్పష్టంగా కనిపిస్తోంది. ఈ అక్రమాల పై జిల్లా కలెక్టర్ నిశాంత్‌కు ఫిర్యాదు చేసినా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

రాష్ట్ర ఎన్నికల పరిశీలకుల పర్యటన

(మొదటి పేజీ తరువాయి)

సందర్శించారు. వివిధ నియోజకవర్గాల మ్యాపులు, వాటిపై పొందుపరిచిన అంశాలను ఆయన తిలకించారు. జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి, ఎస్‌పి దీపిక, జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్, డిఆర్ఒ ఎస్‌డి అనిత, డిపిఆర్ఒ డి.రమేష్ ఇతర అధికారులు కూడా ఉన్నారు.

ఆర్‌కె జూనియర్ కళాశాల విజయభేరి

ప్రజాశక్తి-విజయనగరం

నగరంలోని ఆర్‌కె జూనియర్ కళాశాల విద్యార్థులు ఇంటర్ ఫలితాల్లో విజయభేరి మోగించారు. ఎంపిసి ప్రథమ ఇంటర్‌లో ఎ.రాగచంద్రిక 458, ఎం.సాయిసుధ 450, డి.జ్యోతి స్వరూప్ 450 మార్కులు సాధించారు. ద్వితీయ సంవత్సరంలో ఎంపిసిలో పి.సాయి తేజ 972, కె.గౌతమ్ 955, బైపిసిలో పి.గ్రీష్మ 960, బి.మమత 942, ఎస్.అనూష 930 మార్కులు సాధించారు. ఈ సందర్భంగా విద్యార్థులను కరస్పాండెంట్ కోలా సంతోష్, డైరెక్టర్ అంజనా, ప్రిన్సిపాల్ టి.ఆదిబాబు, అధ్యాపకులు అభినందించారు.

నేరాలు ఘోరాలు

మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి - కొమరాడ

ఇంట్లో వారు తిట్టారని మనస్థాపనతో ఆత్మహత్య చేసుకున్న వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. కొమరాడ ఎస్సై నీలకంఠం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని మాదలింగికి చెందిన అధికారి వెంకటేష్ గురువారం మద్యం తాగి ఇంటికి రాగా, కుటుంబ సభ్యులు మందించారు. దీంతో మనస్థాపనతో ఆత్మహత్య చేసుకునేందుకు ఇంట్లో ఉన్న గడ్డి మందు తాగాడు. ఈ విషయం గమనించిన ఆయన భార్య, కుటుంబ సభ్యులు కురుపాం సిహెచ్‌సికి తరలించారు. అక్కడ చికిత్స అందించిన అనంతరం మెరుగైన చికిత్స కోసం పార్వతీపురం ప్రభుత్వాసుపత్రిలో చేర్పారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందినట్లు తెలిపారు. వెంకటేష్ భార్య రమాదేవి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని పికెఆర్‌పురం గ్రామానికి చెందిన బి.రాజ్‌కుమార్ (30) రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. రాజ్‌కుమార్‌కు నీరసంగా ఉందని చెప్పి విశాఖలోని కెజిహెచ్‌కు వైద్య పరీక్షల నిమిత్తం వెళ్లాడు. తిరిగి వస్తుండగా రామా టాకీస్ వద్ద ప్రయివేటు బస్సు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

గంజాయి స్వాధీనం ; ఇద్దరు అరెస్టు

ప్రజాశక్తి - పాచిపెంట

మండలంలోని పి.కోనవలస చెక్‌పోస్ట్ వద్ద శుక్రవారం పోలీసులు తనిఖీలు నిర్వహిస్తుండగా రెండు కేజీల 100 గ్రాములు గంజాయిని స్వాధీనం చేసుకుని ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేశామని స్థానిక ఎస్సై పి.నారాయణ రావు తెలిపారు. కేరళకు చెందిన సిబిన్ జోసెఫ్, మితతేజ్‌ను అరెస్టు చేసినట్టు తెలిపారు ఒడిస్సా నుంచి దిగుమతి చేస్తుండగా కాలేజీ బ్యాగులో ఉన్న గంజాయి ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. దీని విలువ రూ.21 వేలుంటుందని తెలిపారు.

బంగారు గొలుసు చోరీ

ప్రజాశక్తి-డెంకాడ

మండలంలోని గొడ్డుపాలెం గ్రామానికి చెందిన కలిశెట్టి వరహాలమ్మకు చెందిన బంగారు గొలుసు చోరీకి గురైంది. పూసపాటిరేగ మండలం అగ్రహారం పెళ్లికి వెళ్లిన ఆమె ఆటోలో తిరిగొస్తుండగా ఈ సంఘటన జరిగింది. రెండు తులాల బంగారపు గొలుసు, రెండు తులాలు పుస్తెల తాడును జాలిలో పెట్టి చీరలో కట్టుకొని దాచుకుంది. వీరితో ఆటోలో మరికొంతమంది ప్రయాణించారు. పినతాడివాడ జంక్షన్లో ఆటో దిగాక జాలిని చూస్తే అందులో బంగారు గొలుసు మాయమైంది. దీంతో స్థానిక పోలీస్ స్టేషన్లో ఆమె ఫిర్యాదు చేశారు.

141 మద్యం బాటిళ్లు స్వాధీనం

గుమ్మలక్ష్మీపురం : ఒడిశా నుంచి ఆంధ్రకు అక్రమంగా తరలిస్తున్న 141 మద్యం బాటిళ్ళ ను ఎల్విన్ పేట పోలీసులు శుక్రవారం స్వాధీనం చేసుకున్నారు. సాధారణ ఎన్నికల ప్రక్రియలో భాగంగా మండలంలోని తాటిశీల గ్రామం వద్ద ఏర్పాటు చేసిన చెక్ పోస్ట్ వద్ద పోలీసుల తనిఖీలు చేశారు. ఈనేపథ్యంలో కారులో తరలిస్తున్న 60 మద్యం సీసాలు, బైక్ పై తరలిస్తున్న 81 మద్యం బాటిల్స్ స్వాధీనం చేసుకున్నట్లు సిఐ సత్యనారాయణ, ఎస్ఐ బి శివ ప్రసాద్ తెలిపారు.

9 మంది అరెస్ట్

లక్కవరపుకోట : మండలంలోని కిత్తన్నపేట గ్రామ సమీపంలో పేకాట ఆడుతున్న 9 మందిని అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ ఆర్.గోపాలరావు వెల్లడించారు. అజ్ఞాత వ్యక్తి ఇచ్చిన సమాచారం మేరకు తమ సిబ్బందితో దాడులు చేసినట్లు వివరించారు. వారి నుండి రూ.53,420 నగదును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

ఇంటర్‌లో తోటపాలెం గాయత్రి విజయకేతనం

ప్రజాశక్తి-విజయనగరం

ఇంటర్ ఫలితాల్లో తోటపాలెంలోని గాయత్రి జూనియర్ కళాశాల విజయకేతనం ఎగురవేసింది. ప్రథమ సంవత్సరం ఎంపిసిలో కె.రోషన్ 455 మార్కులు, కె.కమలిని శ్రీ 453, బైపిసిలో కె.కళ్యాణ్ 421 మార్కులు సాధించారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను కళాశాల డైరెక్టర్ అల్లు ఆదినారాయణ, అల్లు వెంకట నరేంద్ర, ప్రిన్సిపల్ అభినందించారు.



విద్యార్థినికి స్వీట్ తినిపిస్తున్న కాలేజీ వ్యవస్థాపకులు రామ్మూర్తి

'వాసు' విజయభేరి

ప్రజాశక్తి-బొబ్బిలి

ఇంటర్ ఫలితాల్లో వాసు జూనియర్ కళాశాల విద్యార్థిని సిహెచ్ పావని ఎంపిసిలో 989 మార్కులు సాధించి జిల్లాలో విజయభేరి మోగించింది. వి.వరుణ్ కుమార్ 986, ఆర్.భార్గవి 985, ఎం.సరిత 985, వి.వినయ్ కుమార్ 985 మార్కులు, బైపిసిలో ఆర్.జ్యోతి 970, వి.దీపిక 968 మార్కులు సాధించి ప్రతిభ కనబరిచారు. ప్రథమ సంవత్సరంలో కె.ఇందు 463, సిహెచ్ స్వప్న 462, కె.శివవర్మరాజు 462, వై. హరిణి 460, ఎ. గోవిందరావు 460, బైపిసిలో ఎం.తనుషా 425, ఆర్.రాణి 411మార్కులు సాధించి ప్రతిభ కనబరిచారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను కళాశాల వ్యవస్థాపకులు రౌతు రామమూర్తి, కరస్పాండెంట్ రౌతు వాసుదేవరావు, ప్రిన్సిపల్స్ పోలినాయుడు, వెంకటేష్, అధ్యాపకులు అభినందించారు.



విద్యార్థులకు మిఠాయి తినిపిస్తున్న వేదాంత కాలేజీ మెంటర్, ప్రిన్సిపల్

అత్యుత్తమ ఫలితాలు సాధించిన 'వేదాంత'

ప్రజాశక్తి - పార్వతీపురం

పట్టణంలోనివేదాంత జూనియర్ కళాశాల ఇంటర్‌లో అత్యుత్తమ ఫలితాలను సాధించింది. శుక్రవారం వెలువడిన ఇంటర్ ఫలితాల్లో ఆ కాలేజీ విద్యార్థిని కె.సుహార్షిణి (ఎంపిసి) 981మార్కులు, జి.నీలిమ (బైసిపి) 977 మార్కులు సాధించి పట్టణంలో ప్రథమ స్థానం నిలిచారు. వీరితో పాటు కె.దర్శిని 976, పి.అనురాధ 969, డి.గౌతమి (బైపిసి) 969, బి టి ఎస్ సుబ్రహ్మణ్యం 966, ఆర్ అఖిల 963 మార్కులు సాధించారు. 32 మంది విద్యార్థులు 900కు పైబడి మార్కులను సాధించారు. అలాగే ప్రథమ ఇంటర్‌లోను మంచి ఫలితాలు సాధించి పట్టణంలో ఇంత ఘనత సాధించడానికి కృషిచేసిన అధ్యాపకులకు, విద్యార్థుల తల్లిదండ్రులకు ఆ కళాశాల మెంటర్ డాక్టర్ పి.అప్పారావు, ప్రిన్సిపల్ ఎస్ఎల్ నాయుడు కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థులకు అభినందనలు తెలిపారు.



అధిక మార్కులు సాధించిన విద్యార్థులతో ఆర్‌కె కాలేజీ యాజమాన్యం

ఆర్‌కె ప్రభంజనం

ప్రజాశక్తి- పార్వతీపురం

స్థానిక ఆర్కే జూనియర్ కళాశాల ప్రథమ ఇంటర్ ఫలితాల్లో ప్రభంజనం సృష్టించింది. కాలేజీకి చెందిన బి.దీపిక ఎంపిసిలో 464మార్కులు సాధించి జిల్లా, రాష్ట్ర స్థాయిలో ప్రథమలుగా నిలించారు. వీరితో పాటు టి.కృష్ణ సృజన 459మార్కులు, డి.సాహు 456, ఎస్.మౌనిక 449, పి.శ్రావణ్ కుమార్ 456, సిహెచ్ జస్వంత్ 446, ఆర్.పవన్ కుమార్ 442, పి.కార్తీక్ 441మార్కులను సాధించారు. 400 మార్కుల పైబడి 31మంది విద్యార్థులు సాధించారని ఆ కళాశాల డైరెక్టర్ పి.రామకృష్ణ తెలిపారు. తమ కళాశాల ప్రారంభం నుంచి వరుసుగా జిల్లాలోనూ, రాష్ట్రంలోనూ గుర్తింపు నిచ్చే ఫలితాలను సాధించిందన్నారు. తమ కళాశాల అధ్యాపకులకు, విద్యార్థులకు, తల్లిదండ్రులకు అభినందనలు తెలిపారు.



విద్యార్థికి స్వీట్ తినిపిస్తున్న కరస్పాండెంట్ అప్పారావు

బైపిసిలో 'సత్యసాయి' సత్తా

ప్రజాశక్తి-బొబ్బిలి

ఇంటర్మీడియట్ ఫలితాల్లో శ్రీసత్యసాయి జూనియర్ కళాశాల విద్యార్థులు సత్తాచాటారు. విద్యార్థిని పిల్ల ఇంద్రాణి బైపిసిలో 440 మార్కులకు 427 సాధించి సత్తా చాటింది. ద్వితీయ ఎంపిసిలో ఎ.దినేష్ కుమార్ 978 మార్కులు సాధించి ప్రతిభ కనబరిచాడు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను కరస్పాండెంట్ చింతా అప్పారావు అభినందించారు.



విద్యార్థులను అభినందిస్తున్న శ్రీసత్యసాయి చైర్మన్ స్వాములు, ప్రిన్సిపల్ ప్రసాదరావు

ఇంటర్ ఫలితాల్లో శ్రీ సత్యసాయి విజయకేతనం

సాలూరు : ఇంటర్ ఫలితాల్లో పట్టణానికి చెందిన శ్రీ సత్యసాయి జూనియర్ కళాశాల విద్యార్థులు విజయకేతనం ఎగురవేశారు. ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో ఇంగ్లీష్ మీడియం ఎంపిసి విభాగంలో కొల్లి శ్రావ్య 966 మార్కులు సాధించి పట్టణం ప్రథమ స్థానంలో నిలిచింది. ఇంటర్ ద్వితీయ సంవత్సరం బైపిసిలో విహెచ్.కార్తికేయ 979 మార్కులు సాధించి పట్టణం ప్రథమ స్థానంలో నిలిచాడు. బైపిసిలో అత్యధిక మార్కులు సాధించి ఆల్ టైం రికార్డు సృష్టించాడు. మొదటి సంవత్సరం ఫలితాల్లో ఎంపిసి విభాగంలో టి.లలితారాణి 450, బైపిసిలో ఎ.షారోన్ 425 మార్కులు సాధించారు. వీరిని కళాశాల చైర్మన్ డాక్టర్ కొల్లి స్వాములు, ప్రిన్సిపల్ సిహెచ్.ప్రసాదరావు అభినందించారు.

తమ్మినాయుడు కళాశాల విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-పాలకొండ

ఇంటర్ ఫలితాలలో స్థానిక తమ్మినాయుడు కళాశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. ప్రథమ సంవత్సరం ఎంపిసిలో జల్లు తనూజ 465 మార్కులు సాధించి టౌన్ ఫస్ట్‌గా నిలిచింది. బైసిపిలో కోనాడ ప్రహర్షిణి 434 మార్కులు సాధించి టౌన్ ఫస్ట్‌గా నిలిచింది. ద్వితీయ సంవత్సరం ఎంసిపి గ్రూపులో బి.హాసిని 989 మార్కులు, బెపిసిలో జి.మురళి 983 మార్కులు సాధించి జిల్లాలో ప్రథమ స్థానంలో నిలిచారు. విద్యార్థులకు కళాశాల ప్రిన్సిపల్ తిరుపతిరావు, కళాశాల ఇన్‌ఛార్జి అనిల్‌కుమార్ అభినందనలు తెలిపారు.



విద్యార్థికి స్వీట్ తినిపిస్తున్న కరస్పాండెంట్ కామేశ్వరరావు

'తాండ్రపాపారాయ' జయకేతనం

ప్రజాశక్తి-బొబ్బిలి

ఇంటర్ ఫలితాల్లో తాండ్ర పాపారాయ జూనియర్ కళాశాల విద్యార్థి బి.భాను ఎంపిసిలో 470 మార్కులకు 465 మార్కులు సాధించి జయకేతనం ఎగురవేశాడు. కె.హలీమ్ కుమార్ 462 మార్కులు సాధించాడు. ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో ఎం.మహేష్ 974, ఎ.వేదగాయత్రి 973, డిజిఎల్ఎఎన్ దీక్షితులు 973 మార్కులు సాధించి ప్రతిభ కనబరిచారు. వీరిని కరస్పాండెంట్ అరసాడ కామేశ్వరరావు, ప్రిన్సిపాల్ ప్రసాద్, గణితం అధ్యాపకులు కనకారావు అభినందించారు.



విద్యార్థులను సన్మానిస్తున్న వాసవి కళాశాల యాజమాన్యం

ఇంటర్ ఫలితాల్లో వాసవి టౌన్ ఫస్ట్

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

ఇంటర్ ఫలితాల్లో పట్టణంలో గల వాసవి జూనియర్ కళాశాల విద్యార్థి జి.జగదీశ్వరరావు సెకెండర్ ఇంటర్ ఎంపిసిలో 987 మార్కులు సాధించి టౌన్ ఫస్ట్‌గా నిలిచాడు. అలాగే ఎస్.శ్రీను 984, వై.సోమశేఖర్ 981, పి.చిన్మయి 980, ఎస్.అనిత 980, మార్కులు సాధించారు. బైపిసి గ్రూపులో వి.మేఘన, ఎస్.నందిని 955 మార్కులు సాధించారు. ప్రథమ సంవత్సరం ఎంపిసిలో ఎస్.హర్షిని 463 మార్కులు, బైపిసిలో పి.సాయి సంపత్ 430 మార్కులు సాధించి టౌన్ ఫస్ట్‌గా నిలిచారు. ఉత్తమ ఫలితాలను సాధించిన విద్యార్థిని, విద్యార్థులకు కళాశాల కరస్పాండెంట్ పివికె మణికుమార్, చైర్‌పర్సన్ పి.సరిత, కళాశాల అధ్యాపకులు, సిబ్బంది పుష్పగుచ్ఛాలందించి, అభినందించారు.

ఎస్‌విఎస్‌ఆర్ విజయకేతనం

ప్రజాశక్తి -పూసపాటిరేగ

ఇంటర్ ఫలితాల్లో ఎస్‌విఎస్‌ఆర్ జూనియర్ కళాశాల విద్యార్థులు విజయకేతనం ఎగురవేశారు. ఎంపిసిలో చోడిపల్లి సతీష్ 945 మార్కులు, మంత్రి సంధ్య 939 మార్కులు సాధించారు. కోల భారతి బైపిసిలో 837 మార్కులు సాధించింది. సత్తాచాటిన విద్యార్థులను కళాశాల యాజమాన్య ప్రతినిధి ఇఎ నారాయణ, ప్రిన్సిపల్ పైడిరాజు అభినందించారు.



సాయిలక్ష్మికి స్వీట్ తినిపిస్తున్న కాలేజీ కరస్పాండెంట్ వేణుగోపాల్

'విద్వాన్' విజయకేతనం

ప్రజాశక్తి-బొబ్బిలి

ఇంటర్ ఫలితాల్లో విద్వాన్ జూనియర్ కళాశాల విద్యార్థులు విజయకేతనం ఎగురవేశారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఎంపిసిలో గెంబలి సాయిలక్ష్మి 986, గొర్లె రమాదేవి 980, జి.నిహారిక 980, జి.చరణ్ సాయి 979మార్కులు, బైపిసిలో బి.సాయిహర్షిత 975 మార్కులు సాధించారు. ప్రథమ సంవత్సరం ఎంపిసిలో జి.మోహనరావు 464, చింతా సుస్మిత 463, బొత్స డీలారాణి 463 మార్కులు సాధించారు. విజయకేతనం ఎగురవేసిన విద్యార్థులను కరస్పాండెంట్ మరిపి వేణుగోపాలనాయుడు, ప్రిన్సిపల్ లక్ష్మిప్రసాద్, యాజమాన్య ప్రతినిధి ధర్మ, అధ్యాపక సిబ్బంది అభినందించారు.

సత్తాచాటిన ఆదర్శ పాఠశాల

ప్రజాశక్తి - మెరకముడిదాం

మండలంలోని గర్భాం ఆదర్శ పాఠశాల ఇంటర్ ఫలితాల్లో సత్తా చాటింది. ప్రథమ సంవత్సరంలో 70 శాతం, ద్వితీయ సంవత్సరంలో 94 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపల్ డివిఎస్ అరుణ తెలిపారు



సురేష్‌ను అభినందిస్తున్న కాలేజీ చైర్మన్, డైరెక్టర్

ఉత్తమ ఫలితాలు సాధించిన భాస్కర్

ప్రజాశక్తి - పార్వతీపురం

ఇంటర్ ఫలితాల్లో పట్టణంలోని భాస్కర్ జూనియర్ కళాశాల అత్యుత్తమ ఫలితాలను సాధించింది. ద్వితీయ ఇంటర్ గొట్టాపు సురేష్ (ఎంపిసి) 970 మార్కులు, బైపీసీలో కోరాడ మౌనిక 927 మార్కులు సాధించి తమ కళాశాలకు ప్రథమంగా నిలిచారు. ప్రథమ ఇంటర్ ఫలితాల్లో ఎంపిసిలో మడక అశోక్ 431 మార్కులు, బైపిసిలో మజ్జి లక్ష్మి 395 మార్కులు సాధించారు. అత్యుత్తమ ఫలితాలను కనబరిచిన విద్యార్థులను కళాశాల చైర్మన్ చుక్క భాస్కరరావు, కళాశాల డైరెక్టర్ బొంతు శ్రీనివాసరావు అభినందించారు, ఇంతటి ఘన విజయాలు సాధించడానికి సహకరించిన కళాశాల అధ్యాపకులను, విద్యార్థుల తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలిపారు.



విద్యార్థులను అభినందిస్తున్న కాలేజీ కరస్పాండెంట్ జగదీశ్వరి

గొట్లాం గాయత్రి ఉత్తమ ఫలితాలు


ప్రజాశక్తి-బొండపల్లి

ఇంటర్మీడియట్ ఫలితాలలో గొట్లాం శ్రీ గాయత్రి జూనియర్ కళాశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారు. ఎంపిసిలో లంక అరవిందు 988, ఆదిమడపల లిఖిత 982 మార్కులు సాధించి సత్తాచాటారు. బైపిసిలో సిరిపరుపు మానస 988, దోసూరు హేమలత 974 మార్కులు సాధించి విజయకేతనం ఎగురవేశారు. ప్రథమ సంవత్సర ఫలితాలలో ఎంపిసిలో రెడ్డి ఆశ 463 మార్కులు, నేతల అనసూయ, యసరపు గౌతమ్ 461 మార్కులు, బైపిసిలో కొప్పల నిహారిక 422 మార్కులు సాధించారు. వీరిని డైరెక్టర్ జి.ఎరుకునాయుడు , కరస్పాండెంట్ సెక్రటరీ జి. జగదీశ్వరి, ఎఒ జి.రాఘవ కుమార్ అభినందించారు.



ఆశలన్నీ సీతంపేటపైనే..

పాలకొండ నియోజకవర్గంలో నాలుగు మండలాలుండగా, సీతంపేట మండలంపైనే ప్రధాన పార్టీలు ఆశలన్నీ పెట్టుకున్నాయి. గత రెండు సార్లు ఎన్నికల్లో వైసిపి గెలుపునకు సీతంపేట నుంచే అత్యధిక మెజార్టీ రావడంతో ఆ మండలంపైనే అందరి దృష్టి పడింది. 2014 ఎన్నికల్లో స్వల్ప మెజార్టీ 1620 ఓట్లతో వైసిపి అభ్యర్థి కళావతి విజయం సాధించగా, సీతంపేట మండల ఓటర్లే గట్టెక్కించారని భావించారు. 2019 ఎన్నికల్లో కూడా 19 వేల మెజార్టీ వచ్చినప్పటికీ సీతంపేట నుంచి ఎక్కువ శాతం ఓట్లు వచ్చాయని ఆ పార్టీ వర్గాలే చెబుతున్నాయి. అయితే టిడిపి కూడా సీతంపేట కేంద్రంగానే రాజకీయాలు చేస్తోంది. ఏది ఏమైనా ఈ ఎన్నికల్లో ఓటర్లు ఎవరికి మొగ్గు చూపుతారో చూడాలి.



పాలకొండ నియోజకవర్గం

బిసి ఓటర్లపైనే అభ్యర్థుల భవితవ్యం

ఇదీ పాలకొండ నియోజకవర్గ పరిస్థితి

ప్రజాశక్తి - పాలకొండ

పాలకొండ ఎస్‌టి నియోజకవర్గమైనా అభ్యర్థి భవితవ్యాన్ని నిర్ణయించేంది బిసి సామాజికవర్గానికి చెందిన వారే. ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలోని పాలకొండ నియోజకవర్గం తొలుత ఎస్‌సి రిజర్వుడు కాగా, 2009 నియోజకవర్గాల పునర్విభజనలో భాగంగా ఎస్‌టిలకు రిజర్వు అయ్యింది. నియోజకవర్గ పరిధిలో పాలకొండ, వీరఘట్టం, భామిని, సీతంపేట మండలాలు ఉన్నాయి. నియోజకవర్గ పరిధిలో 2,45,553 మంది జనాభా ఉండగా వీరఘట్టంలో 65,616 మంది, సీతంపేటలో 55,848 మంది, భామినిలో 44,157 మంది, పాలకొండ మండల పరిధిలో 54,212 మంది పాలకొండ నగర పంచాయతీ పరిధిలో 20,760 మంది జనాభా ఉన్నారు. నాలుగు మండలాల పరిధిలో 295 పోలింగ్ కేంద్రాల్లో 1,94,220 మంది ఓటర్లు ఉన్నారు. అందులో పురుషులు 94,554 మంది ఉండగా, మహిళలు అధికంగా 99,651 మంది ఓటర్ల ఉన్నారు. అలాగే ట్రాన్స్ జెండర్స్ 15 మంది ఉన్నారు. 2009లో నియోజకవర్గ పునర్విభజనతో పాలకొండ ఎస్టీలకు రిజ్వర్ కేటాయించారు. అప్పట్లో కాంగ్రెస్ అభ్యర్థి నిమ్మక సుగ్రీవులు టిడిపి అభ్యర్థి నిమ్మక గోపాలరావుపైనా, 2014లో వైసిపి అభ్యర్థి వి.కళావతి టిడిపి అభ్యర్థి నిమ్మక జయకృష్ణపై విజయం సాధించారు.

2019 ఎన్నికల్లో పాలకొండ నియోజకవర్గంలో వైసిపి గాలి పెరిగిందని చెప్పవచ్చు. వైసిపి అభ్యర్థి కళావతికి 72,054 ఓట్లు రాగా, టిడిపి అభ్యర్థి నిమ్మక జయకృష్ణకు 54,034 ఓట్లు వచ్చాయి. సిపిఐ అభ్యర్థి డివిజి శంకరరావుకు 3,343 ఓట్లు రాగా, బిజెపి అభ్యర్థి సునీతకు 1,169ఓట్లు, కాంగ్రెస్ అభ్యర్థి హిమరక ప్రసాద్‌కు 1,001ఓట్లు వచ్చాయి. ఈ ఎన్నికల్లో నోటాకు ఓటర్లు మొగ్గు చూపారని చెప్పవచ్చు. 3,549 ఓట్లతో మూడో స్థానం దక్కడంతో నియోజకవర్గంలో చర్చనీయాంశమైంది. అయితే ఈసారి ఎన్నికల్లో ఓటర్లు ఏ విధమైన తీర్పును ఇస్తారో ఎవరికీ అంతు పడడం లేదు. మూడో సారికూడా వైసిపి అభ్యర్థి, సిటింగ్ ఎమ్మెల్యే కళావతి రంగంలో దిగారు. అయితే పొత్తుల్లో భాగంగా సీటు జనసేనకు కేటాయించడంతో ఉమ్మడి అభ్యర్థిగా మళ్లీ జయకృష్ణే బరిలో తలపడనున్నారు.

పతి కోసం సతి ప్రచారం

బొబ్బిలి వైసిపి అభ్యర్థి, ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడుకు మద్దతు ఆయన సతీమణి శంబంగి చిన్నమ్మలు శుక్రవారం ఎన్నికల ప్రచారం చేశారు. పాతబొబ్బిలి శ్రీసరే పోలమ్మతల్లిని దర్శించుకున్నారు. అనంతరం ఇంటింటికి వెళ్లి వైసిపికి ఓటు వేయాలని కోరారు. ఆమెతో ఎంపిపి శంబంగి లక్ష్మి, బుడా చైర్మన్ ఇంటి పార్వతి, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ తూముల అచ్యుతవల్లి, మహిళా నాయకులు ఉన్నారు.

- ప్రజాశక్తి, బొబ్బిలి



ప్రచారం చేస్తున్న శంబంగి సతీమణి చిన్నమ్మలు

తిప్పలవలసలో వైసిపి ఎన్నికల ప్రచారం

ప్రజాశక్తి - పూసపాటిరేగ

అభివృద్ధి చేసిన పార్టీలకు అవకాశం ఇవ్వాలని నెల్లిమర్ల ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు కోరారు. శుక్రవారం మండలంలోని తిప్పలవలసలో ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికి తిరిగి సంక్షేమ పథకాలు అందిస్తున్న ప్రభుత్వాన్ని మరోసారి ఆశీర్వదించాలని కోరారు. ప్రచారంలో వైసిపి మండల అధ్యక్షులు పతివాడ అప్పలనాయుడు, జెసిఎస్ మండల కన్వీనర్ మహంతి శ్రీనివాసరావు, వైస్ ఎంపిపిలు అల్లాడ రమేష్, ఎన్.సత్యనారాయ రాజు, నాయకులు మహంతి జనార్ధనరావు, పుప్పాల లక్ష్మీనారాయణ, రామతీర్థ ఆలయ బోర్డు సభ్యులు దాడిశెట్టి త్రినాదరావు, వాసుపల్లి దుర్గమ్మ, వాసుపల్లి అప్పన్న, గున్నారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

75 కుటుంబాలు చేరిక

వెల్దూరు పంచాయతీ కాలపురెడ్డిపేటకు చెందిన బోయి సూరిబాబు ఆధ్వర్యాన 75 కుటుంబాలు వైసిపిలో చేరాయి. వీరికి ఎమ్మెల్యే బడ్డుకొండ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.



వైసిపిలో చేరిన వారితో ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు



శ్రీనివాస్‌కు తిలకం దిద్దుతున్న మహిళ

ఐదేళ్లలో వైసిపి ఆరాచక పాలన

టిడిపి గజపతినగరం ఎమ్మెల్యే అభ్యర్థి కొండపల్లి శ్రీనివాస్

ప్రజాశక్తి - జామి

ఐదేళ్లలో వైసిపి అరాచక పాలన సాగించిందని టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. మండలంలోని అట్టాడ, కుమరాం, బాలరాంపురం గ్రామాల్లో శ్రీనివాస్ ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి సూపర్ సిక్స్ హామీలను ప్రజలకు వివరించారు. ప్రస్తుత అసమర్థ వైసిపి ప్రభుత్వం సంపద సృష్టించలేకపోయిందని, ఈ ఐదేళ్లు అరాచకం, విధ్వంసం చేయడం పాలనగా సాగించిందని చెప్పారు. సంపద సృష్టిస్తేనే అభివృద్ధి, సంక్షేమం రెండు సమానంగా ముందుకు తీసుకువెళ్లగలమని, గతంలో చంద్రబాబు నాయుడు ఈ విషయాన్ని రుజువు చేశారని తెలిపారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు స్వామినాయుడు, పార్లమెంట్ అధ్యక్షులు సూర్యారావు, జనార్దన్ మాస్టారు, సీనియర్ నాయుకులు అప్పలరాజు, కొయ్యన శ్రీను, నర్సింహా నాయుడు, క్లస్టర్ ఇన్‌ఛార్జి సత్యనారాయణ, జనసేన మండల అధ్యక్షులు రాంబాబు, బిజెపి మహిళా అధ్యక్షులు లక్ష్మి పాల్గొన్నారు.

తోటపల్లి నీరిచ్చిన ఘనత మాదే

టిడిపి చీపురుపల్లి ఎమ్మెల్యే అభ్యర్థి కళావెంకటరావు

ప్రజాశక్తి-గుర్ల



మాట్లాడుతున్న కిమిడి కళావెంకటరావు


తోటపల్లి ప్రాజెక్టు నుంచి సాగునీరు అందించిన ఘనత తమదేనని టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి కిమిడి కళావెంకటరావు అన్నారు. గురువారం గుర్లలో జరిగిన ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఐదేళ్లలో వైసిపి ప్రభుత్వం తోటపల్లి కాలువల నిర్వహణకు రూ.3 కోట్లు ఖర్చు చేయకపోవడంతో రైతులు సుమారు 500 కోట్లు రూపాయలు నష్టపోయారని తెలిపారు. పాదయాత్రలో ముద్దులు పెట్టి, పరిపాలనలో ప్రజలపై గుద్దులు గుద్దుతున్న జగన్ ప్రభుత్వం దుర్మార్గాలకు అంతులేదన్నారు.కార్యక్రమంలో మాజీ విప్ గద్దె బాబూరావు, టిడిపి నాలుగు మండలాల అధ్యక్షులు చనమల్ల మహేశ్వరరావు, ఎస్.సురేష్, రౌతు కాము నాయుడు, తాడ్డి సన్యాసినాయుడు, నాయకులు వెన్నె సన్యాసినాయుడు, బిజెపి నాయకులు రెడ్డి పావని, ఉప్పలపాటి రాజేష్ వర్మ, జనసేన నాయకులు విజినిగిరి శ్రీనివాసరావు, మండల నాయకులు తిరుములరాజు కిరణ్ కుమార్, కీలరి సూర్యనారాయణ, పిల్లా అప్పల నాయుడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా 50 మంది కార్యకర్తలు టిడిపిలో చేరారు.

గెలిపిస్తే తాగునీటి సమస్య పరిష్కరిస్తా

టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి బేబినాయన

ప్రజాశక్తి-బొబ్బిలి

సార్వత్రిక ఎన్నికల్లో తనను గెలిపిస్తే పాతబొబ్బిలిలో తాగునీటి సమస్య పరిష్కరిస్తామని టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి బేబినాయన అన్నారు. మున్సిపాలిటీలోని పాతబొబ్బిలిలో శుక్రవారం ఎన్నికల ప్రచారం చేశారు. ఎన్నికల ప్రచారానికి వెళ్లిన బేబినాయనకు తాగునీటి సమస్యను ప్రజలు వివరించారు. దీనిపై బేబినాయన పైవిధంగా స్పందించారు. ప్రచారంలో జనసేన నాయకులు అప్పలస్వామి, బాబు పాలూరి, కార్యకర్తలు పాల్గొన్నారు.



బేబినాయనకు హారతిస్తున్న మహిళ

ప్రిజం-10ను పరిశీలించిన డిఎంహెచ్ఒ

ప్రజాశక్తి - పాలకొండ, వీరఘట్టం

పాలకొండ మండలం ఎం.సింగుపురం, వీరఘట్టం మండలం బిటివాడ పిహెచ్‌సిలను జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ బి.జగన్నాథరావు శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడ నిర్వహించిన పిఎంఎస్ఎంఎ కార్యక్రమంలో గర్భిణీలకు చేపడుతున్న ఆరోగ్య తనిఖీలను పరిశీలించారు. ప్రిజం10 (పిఆర్ఐఎస్ఎం10) అమలు తీరు గురించి అడిగి తెలుసుకున్నారు. దత్తత అధికారి (అడాప్షన్ ఆఫీసర్) ఇంటికి వచ్చి ఆరోగ్య క్షేమ సమాచారం అడిగి తెలుసుకుంటున్నారా, లేదా అని గర్భిణులను అడిగి తెలుసుకున్నారు. ప్రిజం10పై గర్భిణీలు, బాలింతలు, కిషోరబాలికలకు అవగాహన పెంపొందించాలని సిబ్బందికి సూచించారు. పలు ఆరోగ్య కార్యక్రమాల రికార్డులు, నివేదికలు పరిశీలించారు. అందులో భాగంగా పార్చురిషన్ రిజిష్టర్ (డెలివరీ రికార్డు) పరిశీలించి పిహెచ్‌సిలో సాధారణ ప్రసవాలు ఏ మేరకు జరుగుతున్నాయో ఆరా తీశారు. డెలివరీ వార్డును పరిశీలించారు. డ్రగ్ స్టోర్‌లను తనిఖీ చేసి త్వరలో కాలవ్యవధి అవ్వబోయే మందులను ముందుగా వాడాలని సూచించారు. వ్యాక్సిన్ నిల్వలు ఐఎల్ఆర్‌లో పరిశీలించారు. వ్యాక్సిన్ ఇండెంట్ పరిశీలించి సంతప్తి చెందారు. సీజనల్ వ్యాదులను గుర్తించి, వారికి సకాలంలో సరైన వైద్యం అందేలా చూడాలన్నారు. ప్రజలకు వడదెబ్బపై అవగాహన కల్పించి, జాగ్రత్తలు సూచించాలన్నారు. ఉపాధి పనులు నిమిత్తం వెళ్లేవారికి ఒఆర్ఎస్ ప్యాకెట్లు అందజేసి, ఉపయోగించి విధానాన్ని వారికి తెలియజేయాలన్నారు. పిహెచ్సి ల్యాబ్‌ను తనిఖీ చేశారు.నిర్ధారణ పరీక్షలకు అవసరమైన కిట్లు, రియోజెంట్స్ ఉన్నాయో, లేదో పరిశీలించారు. హీమోగ్లోబిన్ శాతం తక్కువగా గుర్తించిన గర్భిణీలకు పిహెచ్సిలో ఐరన్ సుక్రోజ్ ఇంజక్షన్లు ఇవ్వడం, తదుపరి ఏమేరకు హీమోగ్లోబిన్ శాతం వద్ధి చెందినదో పర్యవేక్షణ చేయాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ నితీషా, డాక్టర్ శంకర్, డెమో వై.యోగీశ్వర రెడ్డి, ఈఓ లు శ్రీనివాసరావు, రామారావు, వైద్య సిబ్బంది తదితరులు ఉన్నారు.



చెక్‌పోస్టు రికార్డులను పరిశీలిస్తున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

వెలగవాడ చెక్‌పోస్టు తనిఖీ

ప్రజాశక్తి - పాలకొండ

మండలంలోని వెలగవాడ వద్ద ఏర్పాటు చేసిన అంతర్ జిల్లా సరిహద్దు చెక్ పోస్టును జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి నిశాంత్ కుమార్ శుక్రవారం అకస్మికంగా తనిఖీ చేశారు. వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేయాలని ఆయన సూచించారు. ప్రజలు తమతో పాటు తీసుకువెళ్ళే నగదు, బంగారం, ఆభరణాలు వంటి వాటికి విధిగా ఆధారాలు కలిగి ఉండాలని ఆయన స్పష్టం చేశారు. మద్యం, మాదక ద్రవ్యాలు రవాణాపై గట్టి నిఘా ఉండాలని ఆయన ఆదేశించారు. కార్యక్రమంలో డిఎస్పీ కృష్ణారావు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ఇవిఎంలో మొదటి దఫా ర్యాండమైజేషన్ పూర్తి

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

జిల్లాలో ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషిన్ (ఇవిఎం)ల మొదటి రేండమైజేశన్ శుక్రవారం పూర్తయ్యింది. వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో జిల్లా ఎన్నికల అధికారి నిశాంత్ కుమార్ నేతృత్వంలో స్థానిక కలెక్టరేట్‌లో రేండమైజేషన్ చేపట్టారు. రేండమైజేశన్ ద్వారా ఏ ఇవిఎం ఏ నియోజకవర్గానికి వెళ్తుందో వివరించారు. వాటి వివరాలను రాజకీయ పార్టీల ప్రతినిధులకు అందించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎస్ ఎస్ శోబిక, ఇన్ ఛార్జ్ జిల్లా రెవిన్యూ అధికారి జి కేశవ నాయుడు, ఇవిఎంల నోడల్ అధికారి ఎన్ రమేష్ రామన్, పలువురు రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి - గరుగుబిల్లి

జిల్లా విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కిషోర్ కుమార్ ఆదేశాల మేరకు మండల విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని 33 కెవి లైన్ పరిధిలోని చెట్లు కొమ్మలు తొలగించనున్న నేపథ్యంలో శనివారం ఉదయం ఏడు గంటల నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్టు మండల విద్యుత్ శాఖ ఏఈ బొంతాడ శంకర్రావు వెల్లడించారు. ఈమేరకు గరుగుబిల్లి విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని మరిపెంట గొట్టివలస గొల్లవాని వలస, తులసిరామినాయుడు వలస, చినగగుడబ ,గ్రామాలకు ఉదయం ఏడు గంటల నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు. మెయిం టినెన్స్ పనులు కారణంగా గరుగుబిల్లి, విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని ఆయా గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేయడం జరుగుతుందన్నారు. అదేవిధంగా నాగూరు సబ్ స్టేషన్ పరిధిలోని 11 కె.వి నుండి ఆయా గ్రామాలకు విద్యుత్తు సరఫరా చేస్తున్న లైన్ల పరిధిలో చెట్లు కొమ్మలను తొలగించనున్న దృష్ట్యా నాగూరు, రావివలస, లఖనాపురం, చిలకాం, తదితర గ్రామాలకు ఉదయం ఏడు గంటల నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు తెలిపారు. విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్న నేపథ్యంలో వినియోగదారులు ఈ విషయమై గమనించాలని ఎఇ కోరారు. గరుగుబిల్లి విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో ఆదివారం మెయింటినెన్స్ పనులు కారణంగా సబ్ స్టేషన్ పరిధిలోని ఆయా గ్రామాలకు ఉదయం ఏడు గంటల నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరాను నిలుపు దల చేయడం జరుగుతుందని పేర్కొన్నారు.

ఉపాధి కూలీలకు సూచనలు

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని వసి, పిమిడి గ్రామాల్లో ఉపాధి హామీ పనిప్రాంతాల్లో కూలీలకు బొద్దాం పిహెచ్‌సి వైద్యాధికారి రమాదేవి శుక్రవారం సూచనలు చేశారు. వడదెబ్బ బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో పిహెచ్‌సి సిబ్బంది పాల్గొన్నారు.

సత్తాచాటిన కెజిబివి విద్యార్థులు

ప్రజాశక్తి - కురుపాం :

ఇంటర్ ఫలితాల్లో స్థానిక కస్తూరిబా బాలికల విద్యాలయం విద్యార్థులు తమ సత్తా చాటి శతశాతం ఉత్తీర్ణత సాధించారు. ఇంటర్ మొదటి ఎంపిసి విద్యార్థులు 97.36శాతం ఉత్తీర్ణత సాధించగా, ద్వితీయ సంవత్సరం ఎంపిసి విద్యార్థులు శతశాతం ఉత్తీర్ణత సాధించారు. వీరిలో అక్కినేని లక్ష్మి ప్రసన్న 962 మార్కులు సాధించింది. మొదటి సంవత్సరం 53మంది పరీక్షలు రాయగా, 51మంది ఉత్తీర్ణతతో 96శాతం పొందారు. ద్వితీయ సంవత్సరం 63 మందికి 62మంది ఉత్తీర్ణులై 97శాతం పొందారు. అలాగే స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 140మంది పరీక్షలుకు హాజరు కాగా 106మంది ఉత్తీర్ణత పొంది 75.7శాతం సాధించారు. ఒకేషనల్ 216మందికి 173మంది ఉత్తీర్ణులై 80శాతం పొందారు. ద్వితీయ సంవత్సరం 107మంది హాజరు కాగా, 99మంది ఉత్తీర్ణులై 92.5శాతం సాధించారు. ఒకేషనల్ నుంచి 154 మంది హాజరు కాగా, 142మంది ఉత్తీర్ణులై 92.2శాతం సాధించారు. వీరందరినీ ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు, విద్యార్థులు అభినందించారు.

వేపాడ : మండలంలోని బక్కునాయుడు పేట వద్దనున్న కెజిబివి, గురుకుల, మోడల్ పాఠశాల విద్యార్థులు ఇంటర్ ఫలితాల్లో సత్తాచాటారు. కెజిబివి విద్యార్థి జి.గాయత్రి ద్వితీయ సంవత్సరంలో 978 మార్కులు సాధించి ప్రతిభ కనబరిచింది. ఆదర్శ పాఠశాలలో ఎంపిసిలో యు.శ్రావణి 955, బైపిసి జి.అనూష 959 మార్కులు సాధించారు. మొదటి సంవత్సరంలో ఎంపిసిలో ఆర్.కోమలి 439, బైపిసిలో పి.అఖిల 402 మార్కులు సాధించారు. గురుకులంలో ఎంపిసిలో వై.హరిప్రియ 896, బైపిసిలో టి.శైలజ 943 మార్కులు సాధించారు. ప్రథమ సంవత్సరంలో ఎంపిసిలో ఎం.కావ్య 445, బైపిసిలో ఇక్షిత 409 మార్కులు సాధించారు. వీరిని ఆయా విద్యాసంస్థల ప్రిన్సిపల్స్, సిబ్బంది అభినందించారు.

జియ్యమ్మవలస : మండలంలోని చినమేరంగి ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలను సాధించినట్లు కళాశాల ప్రిన్సిపల్ తెలిపారు. ఇంటర్ మొదటి సంవత్సరం ఎంపిసిలో 17 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 17 మంది, బైపిసిలో 21కి 20 మంది, సిఇసిలో 12మందికి 9 మంది, హెచ్ఇసిలో 6 గురికి ఆరుగురు ఉత్తీర్ణులై 92.85శాతం ఉత్తీర్ణత సాధించారు. సెకెండ్ ఇంటర్‌లో ఎంపిసి 16 మందికి 15 మంది, బైపిసిలో 32 మందికి 31మంది, సిఇసిలో 19కి 16మంది, హెచ్ఇసిలో ఐదుగురికి నలుగురు పాసై 91.66 శాతాన్ని ఉత్తీర్ణత సాధించారు. ఎంపిసిలో 930 మార్కులను సాధించిన బోను కుమారి బైపిపిలో జ్యోతిర్మయి 900 మార్కులు సాధించి కాలేజీ ఫస్ట్‌గా నిలిచారు.

మండల టాపర్ దీక్షిత్

వీరఘట్టం: స్థానిక శ్రీ గాయత్రీ కళాశాలకు చెందిన ద్వితీయ ఇంటర్ ఎంపిసి విద్యార్థి కె.దీక్షిత 986 మార్కులతో సాధించి మండల టాపర్‌గా నిలిచినట్లు కళాశాల కరస్పాండెంట్, ప్రిన్సిపల్ లోకేష్, సింహాచలం తెలిపారు. బైపిసిలో బిజఅనిత 965 మార్కులతో సాధించినట్లు వారు తెలిపారు. ఫస్ట్ ఇయర్ ఎంపిసిలో కె.రాజేశ్వరి 459, ఎస్ ఇందుమతి 451, ఎం లక్ష్మీ 451, బైపిసిలో కె.సుష్మిత 392 మార్కులు సాధించారు. అలాగే స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సెకండ్ ఇయర్ ఎంపిసిలో కె.ఆశ 930, బైపిసిలో పి.భార్గవి 916 మార్కులు సాధించారు. ఫస్ట్ ఇయర్ ఎంపిసిలో కె.ఝాన్సీ 4 56, బైపిసిలో పూజిత, సెకండ్ ఇయర్ సిఇసిలో కె.వసుంధర 779 మార్కులతో ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపల్ త్రినాథ్ తెలిపారు. రేగులపాడు కెజిబివిలో కళాశాలలో ఫస్ట్ ఇయర్ ఎంపిసిలో ఎస్.కీర్తన 446 మార్కులు సాధించినట్లు ప్రత్యేకాధికారి ఎస్.ప్రమీల తెలిపారు.

మోడల్ స్కూళ్ల విద్యార్థులు ప్రభంజనం

డెంకాడ : ఇంటర్ ఫలితాల్లో మోడల్ స్కూల్ విద్యార్థులు 84 శాతం, ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు 71.8 శాతం ఉత్తీర్ణత సాధించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థి ఎం.దుర్గా ఎంపిసిలో 853 మార్కులు సాధించింది. బైపిసిలో కర్రి సతీష్ 415 మార్కులు సాధించాడు. మోడల్ స్కూల్లో బి.అవినాష్ ఎంపిసిలో 981 మార్కులు, సిహెచ్ అనూష బైపిసిలో 908 మార్కులు సాధించారు. మొదటి సంవత్సరంలో టెక్కలి సురేష్ ఎంపిసిలో 447, బొత్స దేవి 411 మార్కులు సాధించారు.

భామిని : ఇంటర్మీడియట్ ఫలితాల్లో స్థానిక మోడల్ స్కూల్ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబర్చి మంచి ఫలితాలు సాధించారని ప్రిన్సిపల్ రఘుపాత్రుని శివకుమార్ తెలియజేశారు. ఇంటర్ ప్రథమ సంవత్సరం 99 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 79 మంది పాస్ అయ్యి , 80 శాతం ఉత్తీర్ణత సాధించగా, ద్వితీయ సంవత్సరం లో 108 విద్యార్థులు హాజరు కాగా, 104 మంది పాస్ అయ్యి 96 శాతం ఉత్తీర్ణత సాధించారు. ఇంటర్ ప్రథమ సంవత్సరం ఎంపిసిలో గవర సాయిగీత 437, బైపిసిలో కుప్పిలి మనమ్మ 399, సిఇసిలో వలురౌతు లక్ష్మీ 442 మార్కులు సాధించారన్నారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఎంపిసిలో చౌదరి ఢిల్లేశ్వరి 936, బైపిసిలో దాసరి పావని 973, ఎంఇసిలో వాడ మనీషా 859, సిఇసిలో సున్నంశెట్టి మీనాక్షి 850 మార్కులతో టాపర్లు గా నిలిచారు. ఈ విజయానికి కారణం అయిన ఉపాధ్యాయులను, విద్యార్థులు ని అభినందించారు.

చెరువును తవ్వేశారు

ప్రజాశక్తి-పాలకొండ

సహజ సంపదను కొంతమంది అక్రమార్కులు దర్జాగా దోచుకుంటున్నారు. నదీ గర్భంలో ఉన్న ఇసుకతో పాటు కొండలు, గుట్టలు కూడా కరిగించేస్తున్నారు. విశ్వసముద్రం పేరుతో తనిఖీలు చేపడుతునప్పటీకీ కొండలు, గుట్టలను తవ్వుకుంటూ పోతున్నారు. మండలంలోని తంపటపల్లిలో పల్లెవాని చెరువు నుంచి ఎటువంటి అనుమతుల్లేకుండా రెండు రోజులుగా ఇష్టానుసారంగా గ్రావెల్‌ను తవ్వుకుని తరలిస్తున్నారు. విషయం తెలిసిన ఇరిగేషన్ ఎఇఇ బురాడ శంకరరావు అక్కడకు చేరుకుని అక్కడ నుండి పార్వతీపురం భూగర్భ శాఖ ఎడి శ్రీనివాసరావుకు ఫోన్లో సమాచారం అందించారు. ఆయన సూచన మేరకు అక్కడ ఉన్న ఐదు ట్రాక్టర్లు, జేసీబీని పట్టుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు.



జెసిబితో చెరువులో జరుగుతున్న తవ్వకాలు

దాహం తీర్చని 'అమృత్'

శిలా ఫలానికే పరిమితం
వాటర్ ట్యాంకుల్లేకుండా పైపులు ఏర్పాటు

ప్రజాశక్తి - పాలకొండ

డివిజన్ కేంద్రమైన పాలకొండ నగర పంచాయతీలో ఇంటి ఇంటికీ కుళాయి ఏర్పాటు చేసి పట్టణ వాసులుకు తాగునీటి సమస్య తీర్చేందుకు అమృత్ పథకం కింద వాటర్ ట్యాంకు నిర్మిస్తామని, ఇంటి ఇంటికి కుళాయిలు ఏర్పాటు చేస్తామని ఊదరగొట్టి చెప్తున్న పాలకులు నేటికి హామీలను అమలు చేయలేదు. ఈ హామీని టిడిపి ప్రభుత్వంతో పాటు ప్రస్తుతం ఉన్న వైసిపి ప్రభుత్వం కూడా పట్టించుకోలేదు. దీంతో పట్టణ వాసులు తాగునీటికి తీవ్ర అవస్థలుపడుతున్నారు. పట్టణంలో సుమారు 5వేల మంది జనాభా ఉండగా, అనేక ప్రాంతాల్లో నీటి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. నాలుగు రక్షిత మంచినీటి పథకాలు ఉన్నప్పటికీ పూర్తి స్థాయిలో నీరు సరఫరా కావడం లేదు. వేసవి కాలమే కాకుండా మిగిలిన కాలంలో కూడా నీటి ఎద్దడి తీవ్రంగానే ఉంది. కోమటిపేట, దేవరపేట, రెల్లివీధి, బడ్డుకొండవారి వీధి, బెల్లాన వీధి, ఇందిరానగర్ కాలనీ, తదితర ప్రాంతాల్లో నీటి సమస్యలు తీవ్రంగా ఉన్నాయి. గతంలో టిడిపి ప్రభుత్వ హయాంలో అప్పటి విద్యుత్ శాఖ మంత్రి కళా వెంకట్రావు ఈ పథకానికి శిలాఫలకం వేశారు. అయితే 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చాక దీనిపైన పెద్దగా పట్టించుకునే పరిస్థితి లేదు. ఏడాది క్రితం ఈ పథకంలో భాగంగా కుళాయిలు ఏర్పాటుకు వీధుల్లో పైపు లైన్లు వేశారు. అప్పట్లోనే దీనిపై కౌన్సిలర్లు తీవ్రంగా వ్యతిరేకించారు. ట్యాంకులు నిర్మించకుండా పైపు లైన్లు వేయడమేమిటని అభ్యంతరం చెప్పారు. అయినప్పటికీ ఇష్టారాజ్యంగా కాంట్రాక్టర్లు పైపు లైన్లు వేసి చేతులు దులుపుకుని, కోటి రూపాయల నిధులు డ్రా చేసినట్లు తెలుస్తుంది. ఏదేమైనా టిడిపి, వైసిపి ప్రభుత్వం హయాంలో అమృతపథకం పూర్తి కాకపోవడం పట్ల పట్టణవాసులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.



పనులు నిలిచిపోవడంతో వృథాగా ఉన్న పైపు గొట్టాలు

రాజ్యాంగాన్ని ధ్వంసం చేసే

బిజెపి, దాని మిత్రపక్షాలను ఓడించండి

ప్రజాశక్తి - పాలకొండ

భారత రాజ్యాంగాన్ని ధ్వంసం చేసే బిజెపి, దాని మిత్రపక్షాలను ఓడించాలని సిపిఎం పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం జిల్లాల కార్యదర్శులు రెడ్డి వేణు, డి.గోవిందరావు పిలుపునిచ్చారు. ఈ మేరకు శుక్రవారం పాలకొండలో పోస్టర్‌ను ఆవిష్కరణ నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ రాజ్యాంగాన్ని పరిరక్షించే దిశగా ఈనెల 14న అంబేద్కర్ జయంతి కార్యక్రమాలు అన్ని ప్రాంతాల్లోనూ నిర్వహించాలని పిలుపునిచ్చారు. భారత రాజ్యాంగాన్ని ధ్వంసం చేస్తున్న బిజెపి, దాని మిత్రపక్షమాలను ఓడించడమే ఎస్‌టి, ఎస్‌సి, బిసి, మహిళా, మైనార్టీ, కార్మిక, కర్షకులు అంబేద్కర్‌కు ఇచ్చే ఘనమైన నివాళి అన్నారు. పాలకొండ మండల సిపిఎం కార్యదర్శి డి.రమణారావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో నాయకులు ఎం.కాంతారావు, డి. దుర్గారావు సింహాచలం, తదితరులు పాల్గొన్నారు.

కొమరాడ : భారత రాజ్యాంగాన్ని ధ్వంసం చేసే బిజెపి ,దాని మిత్రపక్షాలను ఓడించి రాజ్యాంగాన్ని కాపాడాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వాకాడ ఇందిరా కోరారు. రాజ్యాంగాన్ని కాపాడే దిశగా ఈనెల 14న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతి సందర్భంగా కొమరాడలో తలపెట్టిన ర్యాలీని జయప్రదం చేయాలని కోరారు. ఈ మేరకు సిశాడవలస గోడ పత్రిక విడుదల చేశారు. అనంతరం ఇందిర మాట్లాడుతూ అంబేద్కర్ జయంతి సందర్భంగా మండల కేంద్రంలో ర్యాలీ, అంబేద్కర్ చిత్రపటం వద్ద ప్రతిజ్ఞ నిర్వహించాలలన్నారు. కార్యక్రమంలో సీతయ్య, శ్రీను, ఉగాది, యువకులు పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సిపిఎం మన్యం, శ్రీకాకుళం జిల్లాల కార్యదర్శులు రెడ్డి వేణు, గోవిందరావు



కృష్ణరాయపురంలో ప్రచారం చేస్తున్న టిడిపి అభ్యర్థి విజయచంద్ర

కృష్ణరాయపురంలో టిడిపి ప్రచారం

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని కృష్ణరాయపురంలో టిడిపి అభ్యర్థి బోనాల విజయ్‌చంద్ర ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం పాలనలో ప్రజలు నానా ఇబ్బందులు పడ్డారని, రాబోయే ఎన్నికల్లో టిడిపికి అధికారం ఇవ్వాలని, సైకిల్ గుర్తుపై ఓటుకు మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు గొట్టాపు వెంకట నాయుడు, రౌతు వేణుగోపాలనాయుడు, పి.సత్యనారాయణ, పెద్దబ్బాయి, గ్రామ గ్రామ కమిటీ సభ్యులు పూడి శ్రీరాములు, గుణుపూరు తాతబాబు తదితరులు పాల్గొన్నారు.

సాలూరురూరల్ : మండలంలోని కందులపథం, ముచ్చర్లవలస, నడిమివలసలో టిడిపి అభ్యర్థి గుమ్మడి సంధ్యారాణి ఇంటింటికి ప్రచారం చేశారు. మండల టిడిపి అధ్యక్షులు ఆముదాల పరమేష్ అధ్యక్షతన ముచ్చర్లవలసలో 150 మంది టిడిపిలో చేరారు. కంటపరపు కృష్ణ, బడ్నాన వెంకటనారాయణ, మంచాల రామసుందర్, కోదండ లక్ష్మణ, నర్రాల సూర్యనారాయణ, తదితరులకు సంధ్యారాణి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు.

ఇంటర్ ఫలితాల్లో ప్రభుత్వ కళాశాలల హవా

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని గురుకులాల్లో శుక్రవారం వెలువడిన ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సర ఫలితాల్లో ఉత్తీర్ణతలో బాలురు పై చేయి సాధించారు. వీటిలో మల్లి ప్రతిభ కళాశాల విద్యార్థులు మొదటి సంవత్సరం 68 మందికి 68 ఉత్తీర్ణత సాధించి శతశాతం ఉత్తీర్ణత సాధించారు. సీతంపేట గురుకుల బాలుర కళాశాల విద్యార్థులు 158 పరీక్ష రాయగా 133 మంది పాసయ్యారు 84 శాతం ఉత్తీర్ణత సాధించారు. మొదటి సంవత్సరం బాలికల కళాశాల విద్యార్థులు 166 మంది పరీక్ష రాయగా 162 మంది పాసై 97శాతం ఉత్తీర్ణత సాధించారు. రెండో సంవత్సరం ఫలితాల్లో మల్లి బాలురు ప్రతిభా కళాశాల విద్యార్థులు 79 మంది పరీక్ష రాయగా 79 మంది ఉత్తీర్ణత సాధించారు. సీతంపేట బాలుర కళాశాల విద్యార్థులు 150 మందికి పరీక్ష రాయగా 141 మంది, బాలికల కళాశాల విద్యార్థులు 135 మంది పరీక్ష రాయగా 135 మంది ఉత్తీర్ణులయ్యారు. ఈ ఉత్తీర్ణత పిఒ కల్పనా కుమారి డిడి అన్న దొర ప్రిన్సిపల్‌ను అభినందించారు.

గుమ్మలక్ష్మీపురం : ఈ ఏడాది నిర్వహించిన ఇంటర్ పరీక్షల్లో భద్రగిరి పిటిజి కళాశాలకు చెందిన ద్వితీయ సంవత్సరం విద్యార్థిని కె.ప్రవళిక 944 (ఎంపిసి) అత్యధిక మార్కులతో మండలానికే ప్రథమ స్థానంలో నిలిచింది. భద్రగిరి పిటిజి జూనియర్ కళాశాలలో మొదటి సంవత్సరం 143 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 137 మంది ఉత్తీర్ణత సాధించారు. ద్వితీయ సంవత్సరంలో 111 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా అందరూ పాసై నూటికి నూరు శాతం ఉత్తీర్ణత పొందారు. అలాగే భద్రగిరి గిరిజన గురుకుల బాలుర కళాశాలలో మొదటి సంవత్సరం 120 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 117 మంది విద్యార్థులు ఉత్తీర్ణత పొందారు. ద్వితీయ సంవత్సరంలో 95 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 91 మంది పాసయ్యారు.

పాలకొండ : ఇంటర్ ఫలితాల్లో స్థానిక ప్రభుత్వ కళాశాల విద్యార్థులు తమ ప్రతిభ చూపించారు. 145 మంది విద్యార్థులకు గాను 80 మంది ఉత్తీర్ణత సాధించారు. ఒకేషనల్ కోర్సుల్లో 76 మందికి గాను 60 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. బైపిసిలో 918 మార్కులు సాధించిన అనూష, ఎంపిసిలో పల్లా ధనుంజయ్ 910 మార్కులు, ఒకేషనల్ గ్రూప్ లో సందీప్ అనే విద్యార్థి 964 మార్కులు సాధించి కళాశాల టాపర్లుగా నిలిచారు.

జగన్ జైలుకు వెళ్లడం తప్పదు : టిడిపి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మరికొద్ది రోజుల్లో రాష్ట్ర ముఖ్యమంత్రి, వైసిపి అధ్యక్షులు వైఎస్ జగన్మోహన్‌రెడ్డి జైలుకు వెళ్లడం తప్పదని ఉమ్మడి అభ్యర్థి తోయక జగదీశ్వరి అన్నారు. శుక్రవారం గుమ్మలక్ష్మీపురంలో విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. జగన్ చేసిన అక్రమాలు ప్రజలందరికీ తెలిసిన విషయమేనని, కానీ మద్యం కుంభకోణంలో ఆయన హస్తం ఉందనే విషయం బట్టబయలు కాబోతుందని అన్నారు. ఆయన చేసిన లక్ష కోట్లు లూటీతో ఆంధ్ర రాష్ట్ర ప్రజలు తలదించుకునే రోజులు రాబోతున్నాయని, 2024లో జగన్ వస్తే రాష్ట్రం అధోగతి పాలై ప్రజలంతా బతకాలి అంటే పక్క రాష్ట్రాలకు వలసలు పోక తప్పదని అన్నారు. కావున 2024లో ఉమ్మడి ప్రజా ప్రభుత్వం వస్తుందని, రాష్ట్రం అభివృద్ధి దిశగా అడుగులు పడతాయని అన్నారు. ఈ మేరకు ప్రజలు అతి జాగ్రత్తతో టిడిపి అభ్యర్థులకు ఓట్లు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని అన్నారు. సమావేశంలో జనసేన కురుపాం నియోజకవర్గ సమన్వయకర్త కద్రక మల్లేశ్వరరావు, గుమ్మలక్ష్మీపురం, కురుపాం మండల బిజెపి కన్వీనర్లు దివాకర్, వూయక ఆనందరావు, టిడిపి మండల అధ్యక్షులు పాడి సుదర్శన రావు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యసురక్షలో నేత్ర పరీక్షలు

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

ఆరోగ్య సురక్ష శిబిరంలో భాగంగా శుక్రవారం నర్సిపురంలో జరిగిన వైద్యశిబిరంలో నేత్ర వైద్య పరీక్షలను జిల్లా కంటి వెలుగు సెల్ నేత్ర వైద్యాధికారి నగేష్ రెడ్డి పర్యవేక్షించారు. కంటి వైద్య సహాయకులు ఉమామాహేశ్వరి పరీక్షలు నిర్వహించి ముగ్గురికి అంతర కుసుమం, ఇద్దరికి కొయ్యకండ, 18 మందికి దృష్టి దోషం ఉన్నట్లు గుర్తించినట్లు తెలిపారు. శస్త్ర చికిత్సలు అవసరమైన వారికి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో శస్త్ర చికిత్సలు నిర్వహిస్తామని, అలాగే దృష్టి దోషం ఉన్న వారికి ఉచితంగా త్వరలో కళ్ల జోళ్లు అందిస్తామని, సాధారణ వ్యాధులకు మందులతో చికిత్స అందించినట్లు నగేష్‌రెడ్డి తెలిపారు. అనంతరం స్థానిక వైద్యధికారి డాక్టర్ ఎన్ఎంకె తిరుమలప్రసాద్ ఆధ్వర్యంలో సాధారణ వైద్య శిబిరం జరిగింది. ఈ శిబిరానికి దీర్ఘకాలిక వ్యాధులు, గర్భిణీలు, బాలంతలు, చిన్న పిల్లలు, 60 ఏళ్ల పైబడిన వారు వైద్యపరీక్షలు చేయించుకున్నారు. వైద్య పరీక్షలు అనంతరం వారికి కావాల్సిన మందులు అందజేశారు. గర్భిణులకు హిమోగ్లోబిన్, బిపి, షుగర్ పరీక్షలు చేసి రక్తం తక్కువగా ఉన్న వారికి ఐరన్ టాబ్లెట్లు ఇచ్చారు. హిమోగ్లోబిన్ పెరిగేంత వరకూ వారిని పర్యవేక్షించాలని సిబ్బందికి సూచించారు. అవసరమైతే పిహెచ్‌సికి తీసుకొని రావాలని సూచించారు. ఈ శిబిరంలో ఎముకుల వైద్యులు, చెవి ముక్కు వైద్యలు, కంటికి సంబంధించిన వైద్యులు అందుబాటులో ఉన్నారన్నారు. అలాగే ఎండలు తీవ్రతగా ఉన్నందున వీలైనంత వరకూ ఇంటి నుండి బయటకు రాకూడదని సూచించారు. కార్యక్రమంలో స్పెషలిస్ట్ వైద్యులు శేషగిరిరావు, ఎస్.కోటేశ్వరరావు, సూపర్వైజర్ జయగౌడు, నాగమ్మ, అమరావతి, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

కొత్త ట్రాన్స్‌ఫార్మర్‌తో 9 గంటల విద్యుత్ : డిఇ

ప్రజాశక్తి - మక్కువ

కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుతో మండల ప్రజలకు నిరంతర విద్యుత్ సరఫరా జరుగుతుందని విద్యుత్ శాఖ డిఇ వివి కిషోర్ తెలిపారు. శుక్రవారం స్థానిక సబ్ స్టేషన్ వద్ద రెండో పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేసి వెంటనే వినియోగంలోనికి తీసుకువచ్చారు. కార్యక్రమంలో విద్యుత్‌శాఖ ఉన్నతాధికారి వి.రంగారావు, డిఇఇ జి.శివశంకర్, లైన్ ఇన్‌స్పెక్టర్ రవి, లైన్ మాన్ లు సురేష్ శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

14న విద్యుత్ సరఫరా నిలిపివేత

ప్రజాశక్తి - జియ్యమ్మవలస

కురుపాం, గుమ్మలక్ష్మీపురం, జియ్యమ్మవలస మండలాలకు ఈనెల 14న విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు మండల విద్యుత్‌శాఖ ఎఇ బి.శ్రీనివాసరావు తెలిపారు. పార్వతీపురం నుండి చినమేరంగి, గరుగుబిల్లి మండలం నందివానివలస నుంచి కుదమ వరకు విద్యుత్తు లైన్లపై పడుతున్న చెట్లను నరికే పనిలో భాగంగా విద్యుత్ అంతరాయం తప్పడం లేదని ఇందుకు ప్రజల సహకరించాలని ఆయన కోరారు.

రెగ్యులర్ పంచాయతీ కార్యదర్శిని నియమించాలి

ప్రజాశక్తి - కొమరాడ

స్థానిక గ్రామ సచివాలయానికి రెగ్యులర్ పంచాయతీ కార్యదర్శిని వెంటనే నియమించాలని సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి డిమాండ్ చేశారు. 8 నెలులగా ఇన్‌ఛార్జి పంచాయితీ కార్యదర్శి ఉండడంవల్ల కార్యదర్శి ఎప్పుడొస్తారు? ఎప్పుడు వెళ్తారో? తెలియని పరిస్థితిలో గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఒక మండల కేంద్రంలో గల సచివాలయంలో పంచాయతీ కార్యదర్శి లేకపోవడం దారుణమన్నారు. గుణాన పురం సచివాలయానికి రెగ్యులర్ పంచాయతీ కార్యదర్శిగా ఉంటూ కొమరాడ గ్రామ సచివాలయానికి ఇన్చార్జి కార్యదర్శిగా నిధులు నిర్వహించడంతో ఒకరోజు గుణానుపురం, మరో రోజు కొమరాడ, మూడోరోజు మీటింగ్ అంటూ కాలయాపన చేయడంతో సకాలంలో పనులు కాక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తక్షణమే రెగ్యులర్ పంచాయతీ కార్యదర్శిని నియమించాలని కోరారు.



చినబగ్గలో ప్రచారం చేస్తున్న జనసేన అభ్యర్థి జయకృష్ణ

ఏజెన్సీలో జనసేన అభ్యర్థి ప్రచారం

ప్రజాశక్తి - సీతంపేట

గ్లాస్ గుర్తుకు ఓటు వేసి తనను గెలిపించాలని పాలకొండ ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్న జనసేన అభ్యర్థి నిమ్మక జయకృష్ణ కోరారు. మండలంలోని చిన్నబగ్గ, కీసరజోడు పంచాయితీలో శుక్రవారం ముమ్మరంగా ప్రచారం చేపట్టారు. టిడిపి, బిజెపి, జనసేన ఉమ్మడి మేనిఫెస్టో సూపర్ సిక్స్ పథకాలను మహిళలకు వివరించారు. కార్యక్రమంలో సీతంపేట మండల టిడిపి అధ్యక్షులు సవర తోట ముఖలింగం, సీనియర్ నాయకులు వెన్నపు శ్రీను, బిజెపి మండల నాయకులు ఆరిక అమల, సీతంపేట జనసేన నాయకులు బిడ్డిక విశ్వనాథం, ఆర్.రంగనాథం, తోయిక సంధ్యారాణి, ఐటిడిపి కోఆర్డినేటర్ ఇమరక పవన్, జనసేన, బిజెపి, టిడిపి శ్రేణులు యువత పెద్ద ఎత్తున ప్రచారంలో పాల్గొన్నారు.

పలుచోట్ల వాలంటీర్ల రాజీనామా

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని తూడి గ్రామ సచివాలయానికి చెందిన పదిమంది వాలంటీర్లు శుక్రవారం తమ పదవికి రాజీనామా చేసినట్లు సచివాలయ కార్యదర్శి ఎ.చిన్నారావు తెలిపారు. గ్రామ వాలంటర్ల రాజీనామా ఆమోదించామన్నారు.

భామినిలో...20 మంది

భామిని : ప్రజలు సంక్షేమ ఫలాలందించే ప్రభుత్వం వెంటే ఉంటామని బాలేరు -1 సచివాలయం పరిధిలో 20 మంది గ్రామ వాలంటీర్లు శుక్రవారం గ్రామ వాలంటీర్లు విధులు నుంచి తొలుగుతున్నట్లు రాజీనామ పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో జెసిఎస్ కో-ఆర్డినేటర్ కొత్తకోట చంద్ర శేఖర్, వైసిపి నాయకులు మెడిబోయిన చలపతిరావు ఉన్నారు.

23 మంది వాలంటీర్లు రాజీనామా

పాచిపెంట : మండలంలోని కేసలి, పాంచాలి, మోదుగ గ్రామ సచివాలయాల పరిధిలో గల 23మంది వాలంటీర్లు స్వచ్ఛందంగా శుక్రవారం రాజీనామా చేశారని స్థానిక ఎంపిడిఒ పి.లక్ష్మీకాంత్ తెలిపారు.

మోడల్ స్కూల్ ప్రవేశపరీక్షకు హాల్ టిక్కెట్లు విడుదల

ప్రజాశక్తి - కురుపాం

2024-25 విద్యాసంవత్సరం స్థానిక మోడల్ స్కూల్ ఆరో తరగతిలో ప్రవేశాలకు సంబంధించి ఈనెల 21న అర్హత పరీక్ష నిర్వహిస్తున్నామని పాఠశాల ప్రిన్సిపల్ వి.రామలక్ష్మి తెలిపారు. ఆదర్శ పాఠశాలలో ఆదివారం ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు ప్రవేశ పరీక్ష జరుగుతుందని తెలిపారు. ఈ ప్రవేశ పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు తమ హాల్ టికెట్లు https://cse.ap.gov.in, https://apms.apcfss.in/StudentLogin.do వెబ్ సైట్ల నుంచి డౌన్లోడ్ చేసుకోవాలని కోరారు. ప్రవేశ పరీక్ష ఐదో తరగతి స్థాయిలో ఉంటుందని, తెలుగు/ ఇంగ్లీషు మాధ్యమాల్లో రాయవచ్చని తెలిపారు. మొత్తం 100సీట్లకు 285 మంది దరఖాస్తు చేసుకున్నారన్నారు. వివరాలకు ప్రిన్సిపల్, మోడల్ స్కూల్, కురుపాం, 9290452055 ను సంప్రదించాల్సిందిగా కోరారు.



ఉత్తమ మార్కులు సాధించిన తనూజ, దీప్తి, అలేఖ్య, రోహిత్‌వర్మ

సత్తా చాటిన శ్రీనివాస జూనియర్ కళాశాల

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఇంటర్ ఫలితాల్లో నగరంలోని శ్రీనివాస జూనియర్ కళాశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారు. ప్రథమ సంవత్సరం ఇంటర్ ఎంపిసిలో ఎన్.తనూజ 470 మార్కులకు 456, అర్.సుమతీ 454, బైపిసిలో దీప్తి 440 మార్కులకు 424, సిఇసిలో కె.జయశ్రీ 415, హెచ్ఇసిలో అర్.వర్షిత 424 మార్కులు సాధించారు. ద్వితీయ ఇంటర్‌లో ఎంపిసిలో రోహిత్ వర్మ 981, ఆర్.సురేంద్ర 970, బైపిసిలో ఎ.అలేఖ్య 980, శారోమ్ 968, సిఇసిలో టి.కార్తీక్ 891, హెచ్ఇసిలో 955 మార్కులు సాధించి సత్తాచాటారు. ఉత్తమమార్కులు సాధించిన విద్యార్థులను శ్రీనివాస కళశాల కరస్పాండెంట్ యు.సీతారామరాజు అభినందించారు.

శ్రీలక్ష్మి గణపతి కళాశాల విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్



గాయత్రి (989), వినయ్‌కుమార్ (463)

ఇంటర్ ఫలితాల్లో నగరంలోని శ్రీ లక్ష్మి గణపతి జూనియర్ కళాశాల విద్యార్థులు జిల్లాలో అత్యధిక మార్కులు సాధించి ప్రథమ స్థానం సాధించడం అందంగా ఉందని కళాశాల ప్రిన్సిపాల్ ఎల్.శివకుమార్ తెలిపారు. ద్వితీయ ఇంటర్ ఎంపిసిలో రుంకాన గాయత్రి 989 మార్కులు, ప్రథమ ఇంటర్‌లో కావల నాగ వినయ్ కుమార్ 470 మార్కులకు గాను 463 సాధించారని తెలిపారపు. మంచి మార్కులు సాధించిన విద్యార్థులకు ఆయన అభినందనలు తెలిపారు.

మహాలక్ష్మి కాలేజీ అద్భుత ఫలితాలు

స్థానిక ద్వారపూడి రోడ్డులో గల శ్రీ మహాలక్ష్మి కాలేజీ ఇంటర్ ఫలితాల్లో అదుభతమైన ఫలితాలు సాధించింది. ద్వితీయ ఇంటర్ ఎంపిసిలో బి.గణేష్ 983 మార్కులు, బి.రామకృష్ణ 978 మార్కులు, బైపిసిలో కె.మానస 977, కె.ధనలక్ష్మి 973 మార్కులు సాధించారు. మొదటి ఏడాది ఫలితాల్లో ఎంపిసిలో డి.యోగనేశ్వర్ రావు 460, జె.శైలజ 459 మార్కులు, బైపిసిలో ఎం. స్వాతి 454 మార్కులు సాధించారు. ఇవి కాకుండా మరింత మంది విద్యార్థులు మంచి ఫలితాలు సాధించారు. వీరందరికీ డైరెక్టర్ వెంకటరావు అభినందనలు తెలిపారు

మెరిసిన కెజిబివి విద్యార్థులు

ప్రజాశక్తి-రామభద్రపురం

ఇంటర్ ఫలితాల్లో స్థానిక బూసాయవలస కస్తూరిబా కళాశాల విద్యార్థినులు ఉత్తమ ఫలితాలు సాధించారు. ప్రథమ ఇంటర్‌లో 93.9శాతం, ద్వితీయ ఇంటర్‌లో 91.1శాతం ఉత్తీర్ణత సాధించారు. ద్వితీయ ఇంటర్‌లో ఎస్.సుస్మితా 914 మార్కులు, సిహెచ్. మౌనిక 902 మార్కులతో ప్రతిభ కనబరిచారు.

సత్తాచాటిన ప్రభుత్వ కళాశాల విద్యార్థులు

ప్రజాశక్తి-నెల్లిమర్ల

ఇంటర్ ఫలితాల్లో ప్రథమ సంవత్సరంలో సికెఎం ప్రభుత్వ కళాశాల విద్యార్థి బర్ల లలిత బైపిసిలో 440కు 430మార్కులు సాధించి 99శాతంతో రాష్ట్ర స్థాయిలో మంచిస్థానం సాధించింది. ద్వితీయ సంవత్సరం పరీక్షలకు 209మందికి 120మంది ఉత్తీర్ణు లైనట్లు ప్రిన్సిపాల్ తెలిపారు.

18న బడ్డుకొండ నామినేషన్

ప్రజాశక్తి- భోగాపురం

ప్రస్తుత ఎమ్మెల్యే, నెల్లిమర్ల వైసిపి అభ్యర్థి బడ్డుకొండ అప్పలనాయుడు ఈనెల 18వ తేదీన నామినేషన్ వేయనున్నారు. దీనికి సంబంధించిన ఏర్పాట్లు చేస్తున్నారు. నియోజకవర్గంలోని ప్రతి పంచాయతీ నుండి నాయకులు, కార్యకర్తలు హాజరయ్యేలా ఏర్పాట్లు చేస్తున్నారు. గతంలో 2009లో కాంగ్రెస్ అభ్యర్థిగా నామినేషన్ వేసి గెలుపొందారు. తర్వాత 2014లో అదే కాంగ్రెస్ పార్టీ తరఫున నామినేషన్ వేసి ఓడిపోయారు. మళ్లీ 2019లో వైసిపి తరఫున నామినేషన్ వేసి గెలుపొందారు. తాజాగా మళ్లీ ఆయన అదే పార్టీ తరఫున 18న నామినేషన్ వేయనున్నారు. అనంతరం ఈనెల 19వ తేదీ నుంచి మండలంలో ప్రచారం ప్రారంభించనున్నారు. ఎప్పటిలాగే నందిగాం పంచాయతీ నుంచి ప్రచారం ప్రారంభం కానుంది.

ఎన్నికల విధులు సమర్థవంతంగా నిర్వహించాలి

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

ఎన్నికల నిర్వహణలో లోపాలు, నిర్లక్ష్యం లేకుండా సమర్థవంతంగా విధులు నిర్వహించాలని కలెక్టర్ నిశాంత్ కుమార్ ప్రిసైడింగ్ అధికారులను ఆదేశించారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పార్వతీపురం నియోజకవర్గ పిఒలు, ఎపిఒల శిక్షణ కార్యక్రమాన్ని శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చిత్తశుద్ధితో పారదర్శకంగా ఎన్నికలు నిర్వహిస్తానని భావించి ఎటువంటి ఆరోపణలు లేకుండా స్వేచ్ఛగా ప్రశాంతంగా జరిగేలా విధులు నిర్వర్తించాలని స్పష్టం చేశారు. ఎన్నికల విధుల్లో ప్రిసైడింగ్, సెక్టార్ అధికారులు కీలకమన్నారు. ఎన్నికలు సక్రమంగా జరిగేందుకు ఏమైనా అనుమానాలుంటే శిక్షణలో పూర్తి స్థాయిలో నివృత్తి చేసుకోవాలని సూచించారు. మాక్ పోలింగ్ మొదలుకొని స్ట్రాంగ్ రూములో ఇవిఎంలు భద్రపర్చేంత వరకూ తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చర్యలపై పలు సూచనలు చేశారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు నడుచుకోవాలని అతిక్రమించిన, నిర్లక్ష్యం చూపిన కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. శిక్షణలో పార్వతీపురం రిటర్నింగ్ అధికారి కె.హేమలత పాల్గొన్నారు.



పార్వతీపురం, సాలూరులో పిఒల శిక్షణలో మాట్లాడుతున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్, ఐటిడిఎ పిఒ విష్ణుచరణ్

సీతంపేట : ఎన్నికలకు సంబంధించిన నియమ నిబంధనలపై పూర్తి అవగాహన ఉండాలని జిల్లా ఎన్నికల అధికారి నిశాంత్ కుమార్ అన్నారు. పాలకొండ నియోజకవర్గంలోని 4 మండలాల పోలింగ్ అధికారులు, అసిస్టెంట్ పోలింగ్ అధికారులకు నిర్వహించిన శిక్షణ ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలింగ్ రోజు చేపట్టాల్సిన అంశాలపై అవగాహన కలిగి ఉండాలని, మాక్ పోలింగ్ తప్పనిసరిగా నిర్వహించాలని అన్నారు. ఇవిఎంల పనితీరుపై అవగాహన ఉండాలన్నారు. ఏ సందేహాలున్నా ఇప్పుడే నివత్తి చేసుకోవాలని అన్నారు. రీ పోలింగ్ చేసే అవకాశం రాకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఆర్ఒ కల్పనకుమారి, నాలుగు మండలాల తహశీల్దార్లు, మాస్టర్ ట్రైనీలు, ఇతర రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

కురుపాం : ఎన్నికల విధులు, బాధ్యతలను సక్రమంగా నిర్వహించాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి వివి రమణ సూచించారు. శుక్రవారం స్థానిక ఆదర్శ పాఠశాల వద్ద పిఒ, ఎపిఒలకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇవిఎంల వినియోగం, నిర్వహణ, వివి ప్యాడ్స్, మార్క్ కాపీ వాడకం, తదితర అంశాలపై శిక్షణ ఇస్తున్నామని నాలుగు రోజులు శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నామని తెలిపారు. రోజుకు 200 మంది చొప్పున పిఒ, ఎపిఒలకు శిక్షణ ఇస్తున్నామన్నారు. పోలింగ్ రోజున ఎలాంటి పొరపాట్లకు తావులేకుండాశిక్షణను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ఆర్ఒ ఎస్ వివిఎస్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సాలూరు : ఎన్నికను ప్రశాంతంగా నిర్వహించేందుకు శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి, రిటర్నింగ్ అధికారి సి.విష్ణుచరణ్ అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరుగుతున్న శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఎక్కడ ఎటువంటి లోపాలు తలెత్తకుండా ఎన్నికలు సక్రమంగా జరిగేందుకు శిక్షణ పూర్తి స్థాయిలో నివత్తి చేసుకోవాలని అన్నారు. మాక్ పోలింగ్ మొదలుకొని స్ట్రాంగ్ రూములో ఈవిఎంలు భద్రపరిచే వరకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చర్యలపై పలు సూచనలు చేశారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు విధులు సక్రమంగా నిర్వహించాలని ఆయన స్పష్టం చేశారు. అనంతరం రిటర్నింగ్ అధికారి కార్యాలయాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో తహశీల్దార్లు సింహాచలం, ఆనంద్ కుమార్, దిలీప్ చక్రవర్తి, ఎంపిడిఒ ఫణి కుమార్ పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలి

ప్రజాశక్తి-విజయనగరం

వచ్చే ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఎంతో విలువైన తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి నాగలక్ష్మి కోరారు. మే 13న జరిగే ఎన్నికలకు జిల్లాలో ఏర్పాట్లు వేగవంతం చేసినట్లు ఆమె తెలిపారు. కలెక్టరేట్ పోర్టికోవద్ద ఏర్పాటు చేసిన సెల్ఫీ పాయింట్ ను కలెక్టర్ నాగలక్ష్మి శుక్రవారం ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, కొత్తగా ఓటు హక్కు పొందేందుకు మరో మూడు రోజులు మాత్రమే గడువు ఉందన్నారు. అర్హత ఉన్న వారంతా ఈనెల 14లోగా ఓటు కోసం దరఖాస్తు చేయాలని, వారి దరఖాస్తులను పరిశీలించి ఓటు హక్కు కల్పిస్తామని తెలిపారు. ఈనెల 14లోగా దరఖాస్తు చేసుకున్న వారికి మాత్రమే వచ్చే నెలలో జరిగే ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించుకునే అవకాశం లభిస్తుందన్నారు. స్వీప్ కార్యక్రమంలో భాగంగా ఓటర్లను చైతన్యపరిచేందుకు వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. స్వీప్ లో భాగంగా నియోజకవర్గాలు, మండలాల్లో కూడా అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈనెల 18వ తేదీ నుంచి నామినేషన్ల ప్రక్రియను ప్రారంభించడానికి ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఏప్రిల్ 26న నామినేషన్ల పరిశీలన జరుగుతుందని, 29న అభ్యర్థుల తుది జాబితాను ప్రకటిస్తామని తెలిపారు. ఇప్పటికే పిఒలు, ఎపిఒలకు శిక్షణ పూర్తయిందని, రెండో విడత శిక్షణకు ఏర్పాట్లు చేసామని తెలిపారు. ఎన్నికల ప్రవర్తన నియమావళిని అమలు చేసేందుకు ప్రత్యేక బందాలను నియమించామని, క్షేత్ర స్థాయిలో నిఘాను ముమ్మరం చేస్తున్నామని తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కేసులు నమోదు చేస్తున్నామని చెప్పారు. ఇప్పటివరకు జిల్లాలో సుమారు కోటి రూ.54 లక్షలు విలువైన నగదు, మద్యం, వివిధ వస్తువులను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిఘాను మరింత పెంచుతామని, స్క్వాడ్ ద్వారా క్షేత్ర స్థాయిలో తనిఖీలను ముమ్మరం చేస్తామని కలెక్టర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్, స్వీప్ నోడల్ ఆఫీసర్, హౌసింగ్ పీడీ శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.



సెల్ఫీ పాయింట్‌లో ఫొటో దిగిన కలెక్టర్ నాగలక్ష్మి, జెసి కార్తీక్

నిర్ణీత కాలపరిమితిలో విద్యుత్ సమస్యలు పరిష్కారం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విద్యుత్ వినియోగదారుల పంపిణీ సంస్థ అందించాల్సిన సేవలను కాల పరిమితి లోగా అందజేయాలని సిజిఆర్‌ఎఫ్ చైర్మన్, విశ్రాంత న్యాయమూర్తి బి.సత్యన్నారాయణ అన్నారు. శుక్రవారం విద్యుత్ భవనంలో విద్యుత్ సమస్యలు పరిష్కార వేదిక ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పలువురు సమస్యలను విన్నవించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యుత్ సమస్యలు పరిష్కారంలో సిబ్బంది నిర్లక్ష్య వైఖరి అవలంభిస్తే వినియోగదారులు తమ తమ సమస్యలను న్యాయ స్థానం దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవచ్చునన్నారు. సమస్యలను ముందుగా తమ ప్రాంత పరిధిలోని విద్యుత్ కార్యాలయంలో అసిస్టెంట్ ఇంజినీర్ స్థాయి గల సిబ్బందికి తెలపాలని సూచించారు. 1912 టోల్ ఫ్రీ నంబరుకు కాల్ చేసి ఫిర్యాదు చేయాలన్నారు. తరువాత పంపిణీ సంస్థ సిబ్బంది నిర్లక్ష్యం వహించి వినియోగదారులకు ఇబ్బంది కల్గించినా, సమస్యను పరిష్కరించ కుండా కాలయాపన చేసినా న్యాయస్థానాన్ని ఆశ్రయించవచ్చునని తెలిపారు. సమస్య పరిష్కారంతో పాటు సేవ అమలులో జాప్యానికి పరిహారం కూడా సంస్థ చెల్లిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఇ ఎం.లక్ష్మణరావు, ఇఇ పూడి హరి, విద్యుత్ శాఖ అధికారులు, వినియోగధారులు పాల్గొన్నారు.

సిజిఆర్‌ఎఫ్ చైర్మన్ సత్యనారాయణ



సమావేశంలో మాట్లాడుతున్న సిజిఆర్‌ఎఫ్ చైర్మన్ సత్యనారాయణ